ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు

శుక్రవారం 12 సెప్టెంబరు 2025



నూతన కలెక్టర్‌గా హిమాన్షు శుక్లా

అనంతపురానికి ఆనంద్ బదిలీ



నెల్లూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా నూతన కలెక్టర్‌గా హిమాన్షు శుక్లా నియమితులయ్యారు. 2013 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఈయన ప్రస్తుతం ఐఅండ్‌పీఆర్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 12 ఏళ్ల సర్వీసులో పలు పోస్టుల్లో పనిచేసిన శుక్లాకు మంచి పరిపాలన అధికారిగా పేరుంది. తొలుత విశాఖ జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా శిక్షణ పొందారు. అనంతరం తిరుపతి సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. తదుపరి గుంటూరు, పశ్చిమ గోదావరి జేసీగా, టూరిజం డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. అలానే కోనసీమ జిల్లా కలెక్టర్‌గా కూడా హిమాన్షు శుక్లా పని చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు కలెక్టర్లను గురువారం రాత్రి ప్రభుత్వం బదిలీ చేయగా నెల్లూరు కలెక్టర్‌గా శుక్లా నియమితులయ్యారు. కాగా ప్రస్తుత కలెక్టర్ ఓ ఆనంద్ అనంతపురం కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. గతేడాది జూలైలో జిల్లాకు వచ్చిన ఆనంద్ 14 నెలలపాటు కలెక్టర్‌గా పనిచేశారు. సౌమ్యుడిగా గుర్తింపు తెచ్చుకుని, ఎక్కడా వివాదాలకు తావివ్వలేదు. మంచితనంతో సిబ్బంది చేత పనులు చేయించారు. పీజీఆర్ఎస్ అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి, రాష్ట్రంలోనే తొలిసారిగా ఈ అర్జీలపై ఆడిట్ నిర్వహించిన కలెక్టర్‌గా ఆనంద్ గుర్తింపు తెచ్చుకున్నారు. అలానే రెవెన్యూ సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు రికార్డులన్నింటినీ డిజిటలైజ్ చేయించి ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను కూడా రూపొందిస్తున్నారు. ఇక 20 ఏళ్లగా భూములు దక్కక కాళ్లరిగేలా తిరుగుతున్న మాజీ సైనికులకు ఉపశమనం కల్పించారు. ఒకేసారి 180 ఎకరాలను స్వాతంత్ర్య దినోత్సవం రోజున మాజీ సైనిక కుటుంబాలకు పంపిణీ చేసి మన్ననలు పొందారు.

ఏపీఎఫ్‌డీసీ ఆర్‌ఎంగా వివేక్



నెల్లూరు (వెంకటేశ్వరపురం) : ఏపీఎఫ్‌డీసీ ఆర్‌ఎం (రీజనల్ మేనేజర్)గా ఐఎఫ్ఎస్ అధికారి వివేక్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురు వారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రసుత్తం ఈయన తిరుపతి డీఎఫ్‌వోగా విధులు నిర్వహిస్తున్నారు. కొన్ని నెలలుగా ఖాళీగా ఉన్న ఆర్‌ఎం స్థానంలో ప్రభుత్వం ఐఎఫ్ఎస్ అధికారిని నియమించింది.

9,314 గృహాలు ప్రవేశాలకు సిద్ధం

● పూర్తికావస్తున్న ఇళ్లనిర్మాణాలు ● నెరవేరనున్న పేదల కల

7 లో..

సంగం బ్యారేజీ నుంచి నీటి విడుదల

పెన్నాలోకి 3,800 క్యూసెక్కుల నీరు ● పరివాహక ప్రాంతాల్లో అప్రమత్తం

సీజనల్ హాస్టళ్లకు దరఖాస్తుల ఆహ్వానం

8 లో..



వెంకటగిరి : పోలేరమ్మ ఊరేగింపులో జనం

జన జాతర

● పోలేరమ్మ దర్శనానికి తరలివచ్చిన భక్తజనం ● విరూపోత్సవంతో ముగిసిన వేడుక

వెంకటగిరి/వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 11: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర జన సంద్రాన్ని తలపించింది. గురువారం ఉదయం 4 గంటలకే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. బుధవారం రాత్రి చాకలింటి నుంచి ఊరేగింపుగా వచ్చిన అమ్మవారిని.. గురువారం వేకువ జామున ఆలయం వద్ద వేపమండలతో వేసిన పందిరిలో కొలువు దీర్చారు. అప్పట్నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. వేయికళ్ల దుత్తల్లో బియ్యపు పిండితో చేసిన ప్రమిదలలో నూనె దీపాలు వెలిగించి భక్తులు నెత్తిన పెట్టుకు వచ్చి నాలుగు కూడల్లో బద్దలు కొట్టారు. మడిచీరలపై ఆసాదుల తప్పెట్ల నడుమ మరికొందరు. నవధాన్య మొలకలను అమ్మవారికి సమర్పించారు. రాజాల ప్యాలస్ నుంచి ఆభరణాలైన బంగారు శూలం, సరుదును రాజా అనుచరుల ఆధ్వర్యంలో అమ్మవారికి అలంకరించి తీసుకెళ్లారు. నగరి సారెలైన సరవళ్లను రాజా అనుచరులు అమ్మవారికి 12గంటలకు సమర్పించారు. దీంతో వెట్టివారు కుండలో వెలిగించిన గండర దీపాన్ని అమ్మవారికి చూపించి దీపం ఆరకుండా ఊరి పొలిమేరల్లోకి తీసుకెళ్లారు. అక్కడ అమ్మవారి బలి దున్నపోతును బలిచ్చి ఆ రక్తంతో పొలికుండల్లోని అన్నంతో కలిపి ఊరి పొలిమేరల్లో పొలి..పొలి అని అరుస్తూ చల్లారు. అనంతరం దీపాన్ని విరూప మండపానికి తీసుకెళ్లారు. దున్నపోతు రక్తంతో తడిచిన కత్తిని అమ్మవారికి చూపాక.. రాజాల ప్యాలెస్‌లో పూలతో అలంకరించిన ట్రక్కులో అమ్మవారి ప్రతిమను సాయంత్రం 4 గంటలకు భక్త జనసందోహం నడుమ ఊరేగించారు. శివాలయం వద్దకు ఊరేగింపు చేరుకోగా, అమ్మవారికి అలంకరించిన ఆభరణాలను తీసేశారు. అనంతరం కైవల్యానది మీదుగా మల్లయ్య తోట వద్ద ఏర్పాటు చేసిన విరూప మండపానికి అమ్మవారు చేరుకోగా, 7.35 గంటలకు ప్రతిమను విరూపం చేసే కార్యక్రమం ముగిసింది. అప్పటి వరకు గండర దీపం ఆరిపోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అమ్మవారి ప్రతిమ మట్టిని ఇంట ఉంచుకుంటే అష్టైశ్వర్యాలు కలుగుతాయని, తింటే రోగాలు దూరమవుతాయన్నది భక్తుల నమ్మకం. అందుకని మట్టి కోసం భక్తులు పోటీపడటంతో విరూప మండపం వద్ద కొంత ఉద్రిక్తత నెలకొంది. పోలేరమ్మ జాతర రాష్ట్ర పండుగ కావడంతో, ప్రభుత్వం తరఫున దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి ఆనం, పక్కన ఎమ్మెల్యే కురుగొండ్ల



ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దంపతులు



జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



డీసీఎంఎస్ చైర్మన్ గంగోటి నాగేశ్వరరావు

● జమ్మలపాలెం ఎంఐజీ లేఅవుట్ అభివృద్ధిలో లొసుగులు
● ఇటీవల జరిగిన పనులను పరిశీలించిన జేసీ కార్తీక్
● జరిగిన వ్యవహారంపై ఉన్నతాధికారులకు నివేదిక
● కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని, తదుపరి పనులు నుడాకు అప్పగించాలని సిఫారసు



జమ్మలపాలెంలోని ఎంఐజీ లేఅవుట్

పనులు చేయలేదు.. బిల్లులు మాత్రం బొక్కేశారు!

జలదంకి మండలం జమ్మలపాలెం వద్ద ఉన్న ఎంఐజీ లే అవుట్ ఇది. ఇక్కడ రూ.27.58 కోట్ల పనులు జరిగాయని అంటే ఎవరైనా నమ్ముతారా!?. నిజమండి.. అన్ని కోట్ల పనులు ఇక్కడ పూర్తయి రూ.26.19 కోట్ల బిల్లులు కాంట్రాక్టర్ తీసుకున్నారట. అధికారులు కూడా కళ్లుండి కబోదిలా వ్యవహరించడంతో అక్కడ జరిగిన అవినీతి వెలుగులోకి రాలేదు. కానీ ప్లాట్లు కొనుగోలు చేసిన వారు మాత్రం అధికారులకు ఫిర్యాదు చేయడం, వెనువెంటనే జేసీ కార్తీక్ అధికార యంత్రాంగాన్ని వెంటబెట్టుకుని లే అవుట్‌లో తనిఖీలు చేయడంతో అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చింది.

కావలి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కావలికి సమీపంలోని జమ్మలపాలెం (జలదంకి మండలం) వద్ద ఏర్పాటు చేసిన ఎంఐజీ లేవుట్‌లో సక్రమంగా పనులు జరగలేదని జరిగిన పనుల్లోనూ అక్రమాలు జరిగాయని సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలంటూ నుడా వైస్‌చైర్మన్, జేసీ కార్తీక్ ఆ శాఖకు చెందిన ఉన్నతాధికారులకు లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. గతంలో జగనన్నస్మార్ట్ టౌన్‌షిప్ (ప్రస్తుతం ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్) కోసం జమ్మలపాలెంలో 97.16 ఎకరాలను కేటాయించారు. ఆ లేఅవుట్ డెవలప్‌మెంట్ కోసం రూ.48.58 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఇందులో రూ.33,07,50,730లను పనులకు కేటాయించారు. 2022, సెప్టెంబరు 30వ తేదీకల్లా పనులు పూర్తి కావాల్సి ఉండగా ఒప్పందాలను పొడిగిస్తూ వచ్చినా ఇప్పటికి 70 శాతం మాత్రమే పనులు పూర్తయ్యాయి. వీటి విలువ రూ.27.58 కోట్లు ఉండగా ఇప్పటికే రూ.26.19 కోట్ల బిల్లులు తీసుకున్నారు. బిల్లు చెల్లింపులో ఎలాంటి జాప్యం జరగకపోయినా పనులు నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు.

● ప్లాట్ల యజమానుల ఫిర్యాదుతో..

ఎంఐజీ లేఅవుట్‌లో చెప్పిన ప్రకారం అభివృద్ధి పనులు చేయలేదని కొందరు ప్లాట్ల యజమానులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ పనులను పర్యవేక్షిస్తున్న పబ్లిక్‌హెల్త్ అధికారులతో నుడా అధికారులు సమీక్షించినా మార్పు రాలేదు. దీంతో ఇటీవల నుడా వైస్‌చైర్మన్‌గా ఉన్న జాయింట్ కలెక్టర్ కార్తీక్ కావలి ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణతో కలిసి జమ్మలపాలెంలోని ఎంఐజీ లేఅవుట్‌ను పరిశీలించారు. అక్కడ రోడ్లు, డ్రైన్లు, కల్వర్టులు, ఫుట్‌పాత్, నీటి సరఫరా, భూగర్భ డ్రైనేజీ, సెంట్రల్ డివైండింగ్,లైటింగ్ తదితర పనులు పూర్తికాలేదని వెల్లడైంది. కొన్ని పనులు అసంపూర్తిగా జరగ్గా మరికొన్ని పనులు అసలు ప్రారంభమే కాలేదని నిర్ధారించారు. పనులు నిర్లక్ష్యంగా సాగడం వల్ల కాంట్రాక్టర్ మురళీమోహన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని, మిగిలిన పనులను నుడా ద్వారా పూర్తి చేయాలని నుడా వైస్‌చైర్మన్ ఉన్నతాధికారులకు సిఫారసు చేశారు.

లేఅవుట్‌ను పరిశీలిస్తున్న జేసీ కార్తీక్ తదితరులు(ఫైల్)



మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ ఎక్కడ!?

శ్రీలంకలోనా... బెంగళూరులోనా!? ● కావలిలో విస్తృత చర్చ

కావలి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కావలి ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డిపై హత్యాయత్నం కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆచూకీ కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. జలదంకి పోలీస్‌స్టేషన్‌లో ప్రతాప్‌తోపాటు మరో నలుగురిపై కేసు నమోదయ్యింది. వీరిలో ముగ్గురు అరెస్టయి రిమాండ్‌లో ఉండగా మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మరో నిందితుడు రాజేష్ పరారీలో ఉన్నారు. ప్రతాప్‌రెడ్డిని అరెస్ట్ చేసేందుకు పోలీస్‌లు రెండు బృందాలుగా ఏర్పడి విస్తృతంగా గాలిస్తున్నారు. అయితే, ఆయన శ్రీలంకకు వెళ్లి ఉంటారని పోలీసులు కోర్టులో తెలిపినట్లు సమాచారం. వాస్తవంగా ప్రతాప్‌రెడ్డి ఎక్కడ ఉన్నారనేది కావలిలో పెద్ద చర్చనీయాంశమైంది. బెంగళూరులో ప్రతాప్‌కు రాజకీయ పలుకుబడి ఉండటంతో అక్కడే ఉండవచ్చని అనుచరుల్లో చర్చ నడుస్తోంది. మరోవైపు ప్రతాప్ మొబైల్ స్విచ్ఛాఫ్ ఉండటంతో ఎక్కడ ఉన్నాడో గుర్తించలేక పోతున్నామని పోలీసులు అంటున్నారు.

రెండో విడతలోనూ నిరాశే!

● 32 బార్లకు ఐదింటికే దరఖాస్తులు

నెల్లూరు (క్రైం) : నూతన బార్ పాలసీ ప్రభావం వ్యాపారులపై కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. మొదటి విడత లో 55 బార్లకు గెజిట్ విడుదలవగా, 17 బార్లకు మాత్రమే దరఖాస్తులు అందాయి. మిగిలిన 32 బార్లు మూతపడ్డాయి. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం మరోమారు నోటిఫికేషన్ విడుదల చేసింది. రెండో విడతలోనూ 5బార్లకు మాత్రమే దరఖాస్తులు వచ్చాయని అధికారులు చెబుతున్నారు. 27 బార్లకు దరఖాస్తులు అందలేదు. ఈ నెల 14న దర ఖాస్తులకు గడువు ముగియనుండగా, 15న లాటరీ విధానంలో యజమానులకు బార్‌లు కేటాయించనున్నారు. ఇప్పటివరకు అయితే ఎక్సైజ్ అధికారులు చివరిరోజు అంటే ఆదివారంపైనే ఆశలు పెట్టుకుని ఉన్నారు.



వెల్లంటిలో వరి పొలంలో వర్షపు నీరు

ఇటు కోతలు.. అటు వానలు

అన్నదాతను భయపెడుతున్న వరుణుడు

అల్పపీడన ప్రభావంతో బుధవారం కురిసిన వర్షం కారణంగా కోతకు సిద్ధమైన వరిపైరు ఆందోళనకరంగా మారింది. నెల్లూరురూరల్ మండలం సౌత్ మోపూరు, కొత్తవెల్లంటి, పాతవెల్లంటి, సజ్జాపురం ప్రాంతాలలో కేఎన్ఎం 1638, ఎంటీయూ 1010 రకం వరి కోతకు సిద్ధమైంది. ఆశించిన మేర దిగుబడులు చేతికందుతాయనుకున్న అన్నదాత ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. కురిసిన వర్షానికి పైరు నేలవాలగా, ధాన్యం గింజలు తడవడంతో అన్నదాత ఆందోళనకు గురవుతున్నాడు.

- నెల్లూరు రూరల్

నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి) : ఓ పక్క వరి కోతలు ముమ్మరంగా సాగుతున్న సమయంలో అన్నదాతను వరుణుడు భయపెడుతున్నాడు. ఖరీఫ్ సీజనుకు సంబంధించి విడవలూరు, కొడవలూరు, బుచ్చి, ఇందుకూరుపేట, బోగోలు, అల్లూరు మండలాల్లో కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. అధికశాతం రైతులు వరికోత యంత్రాలతో కోయడం వల్ల ధాన్యాన్ని ట్రాక్టర్లతో తీసుకెళ్లి రోడ్లపై ఆరబెట్టుకుంటున్నారు. కొంతమంది రైతులు మాత్రం వచ్చిన ధరకు దళారులను ఆశ్రయిస్తున్నారు. కొంతమేర అవసరాన్ని బట్టి ప్లాస్టిక్ పట్టలను ముందు జాగ్రత్తగా ఏర్పాటు చేసుకుంటున్నారు. అయితే పంట కోతకు వచ్చిన రైతుల్లో మాత్రం తీవ్ర ఆందోళనలు నెలకొంటున్నాయి. ఎప్పుడు వర్షం కురుస్తుందో తెలియని పరిస్థితులు నెలకొనడంతో పంట కోయాలా!? వద్దా అనే సందిగ్ధం నెలకొంది. కొద్దిపాటి వర్షం పడితే పర్వాలేదు కానీ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిస్తే మాత్రం గింజలు బాగా తడిచిపోయి పైరు వాలిపోయే పరిస్థితి ఉంటుంది. ఒకవేళ పంట కోస్తే నిల్వ చేసుకునే సౌకర్యాలు కూడా అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఒత్తిడితో అన్నదాతలు ఉంటున్నారు. మరికొంత మంది రైతులు మాత్రం దళారులను ఆశ్రయించి, అందిన ధరకు విక్రయించేస్తున్నారు. జిల్లాలో బుధవారం కురిసిన వర్షం కారణంగా ఎక్కడా ఎలాంటి పంట నష్టం జరగలేదని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఒక పూట వర్షం పడినప్పటికి మరుసటి రోజు ఎండ రావడం వల్ల పంటకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, కోసిన ధాన్యం మాత్రం తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అయితే, సాయంత్రం నుంచి మేఘావృత్తం కావడం, చల్లటి గాలులు వీయడంతో ఏంచేయాలో తెలియక కోసిన ధాన్యాన్ని దళారులకు విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.

నేడు విద్యుత్ అదాలత్

కోవూరు, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక విద్యుత్ సమస్యల పరిష్కారానికి స్థానిక ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 3.30 నుంచి 5.30 గంటల వరకు విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఏడీఈ కే రమేష్ చౌదరి తెలిపారు. స్టౌబీడీ విద్యుత్తు శాఖ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, సంగం, విడవలూరు, కొడవలూరు, ఇందుకూరు పేట మండలాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 10434
వెండి కిలో ధర	రూ. 128900
వెండి ఒక గ్రాము	రూ. 131.90



అప్పటికప్పుడే కౌలు రైతులకు కార్డులు

● బొమ్మిశెట్టి శివకృష్ణయ్య, తహసీల్దారు, పొదలకూరు

పొదలకూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కౌలు రైతులు ఆయా గ్రామాల వీఆర్‌వోలను కలిస్తే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, అప్పటికప్పుడే కార్డులు అందజేస్తారు.

?. సూరాయపాలెం 36 ఎకరాల మేత పోరంబోకు కబ్జాపై చర్యలు తీసుకున్నారా

!. సూరాయపాలెం గ్రామం సర్వే నెంబరు 352లో మేత పోరంబోకు కబ్జాపై కలెక్టర్‌కు నివేదిక అందజేశాం. త్వరలో ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారు.

?. 'అన్నదాత సుఖీభవ' అప్‌డేట్స్ ఏంటి

!. 'అన్నదాత సుఖీభవ' లబ్ధిదారులు ఎవరైనా మరణించి ఉంటే ఆ కుటుంబ సభ్యులు మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకుంటే ప్రక్రియ పూర్తి చేస్తాం.

?. రీ సర్వే ప్రక్రియ ఎలా సాగుతోంది

!. ఇప్పటికే మండలంలోని 10 గ్రామాలు తప్ప మిగిలినచోట్ల గ్రామ సభలు నిర్వహించి రీ సర్వే చేస్తున్నాం. ఇప్పటికే గ్రామ సరిహద్దులను ఏర్పాటు చేశాం. ప్రభుత్వ భూమిని కొలిచే ప్రక్రియ సాగుతోంది.

?. పేదల ఇళ్ళ స్థలాల పరిస్థితి ఏంటి

!. నివేశన స్థలాలు లేని పేదలు దరఖాస్తు చేసుకుంటే వారికి ఇంటి స్థలాలు కేటాయిస్తాం. ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు.

?. రేషన్ కార్డుల పంపిణీ పూర్తయిందా

!. మండలంలో 90 శాతం రేషన్‌కార్డుల పంపిణీ పూర్తయింది. మిగిలిన 10 శాతం త్వరలో పూర్తి చేస్తాం.

మెమో 57ను అమలు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

పొదలకూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : 2004 జనవరి 1కి ముందు నియమితులైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెమో 57ను తక్షణమే అమలు చేయాలని మెమో 57 డీఎస్సీ-2003 ఉపాధ్యాయుల ఫోరం జిల్లా కన్వీనర్లు సుబ్బయ్య, సూర్య ప్రసాద్, బీ వెంకటేశ్వర్లులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ముందు ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దారు శివకృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57 ప్రాప్తికి అర్హత ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని కోరారు. లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అర్హత కలిగిన 11 వేల మందికి పాత పెన్షన్‌నే వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం శ్రీనివాసులు, కాంతారావు, రమేష్, మాధవి, నౌరాజ్, రామకృష్ణ, శ్రీనివాసులు, రాధాకృష్ణయ్య, మాధవి పాల్గొన్నారు.

యూరియా వాడకం తగ్గించండి

కోవూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులు పంట పొలాల్లో యూరియా వాడకాన్ని తగ్గించాల్సిందిగా వ్యవసాయాధికారిణి టీ రజని కోరారు. లేగుంటపాడులో గురువారం యూరియా వాడకాన్ని తగ్గించాలని కోరుతూ ప్రదర్శన నిర్వహించారు. ఎకరాకు మూడు బస్తాల యూరియా మాత్రమే వాడాలన్నారు.

రైతులను ఆదుకోవాలి

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాల గుర్నాథం అన్నారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షంతో వరి నీట మునిగి రైతాంగం నానా బాధలు పడుతున్నారన్నారు. ధాన్యానికి మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలన్నారు.

అభివృద్ధి కన్నా సమస్యలే ఎక్కువ : బుచ్చి నగర పంచాయతీలో అభివృద్ధికన్నా ప్రజల సమస్యలే ఎక్కువని సీపీఎం నాయకుడు ముత్యాల గుర్నాథం అన్నారు. ముంబాయి జాతీయ రహదారి వెంబడి పూడికతీత పేరుతో కోట్ల రూపాయలు కాజే స్తున్నారన్నారు. మాన్యువల్ పద్ధతిన పూడిక తీస్తే ప్రజాధనం వృథా కాకుండా ఉంటుందన్నారు.

ఎక్కడికెళితే అక్కడే.. 'పోషణ'!

ఇకపై ఎక్కడైనా సరుకులు తీసుకోవచ్చు
'పోషణ్ ట్రాకర్ యాప్'తో సౌలభ్యం

మనుబోలు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు అందించే సరుకులు ఇకపై ఎక్కడైనా పొందవచ్చు. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ యాప్ ను అందుబాటులోకి తీసుకువచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు అంగన్‌వాడీల్లో ఏ సమస్య తలెత్తకుండా పక డ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాయి. కేంద్రాల్లో అవకతవకలకు చెక్ పెట్టేందుకు ఇప్పటికే 'పోషణ్ ట్రాకర్ యాప్' ను ప్రవేశపెట్టారు. అందులోనే మైగ్రేషన్ ఆప్షన్‌ను తీసుకువచ్చి ఎక్కడినుంచైనా సరుకులు పొందేలా వెసులుబాటు కల్పించారు. ఇన్నాళ్ళు కేంద్రాల్లో మాత్రమే సరుకులు లబ్ధిదారులకు అందించేవాళ్ళు. తద్వారా అవకతవకలకు కొంతమేర ఆస్కారం ఉండేది.

సరుకులు పక్కదారి పట్టే అవకాశం లేదు

ఇప్పటివరకు సరుకులు ఇచ్చే సమయానికి ఇతర ప్రాంతాలకు వెళితే లబ్ధిదారులకు ఆ సమయంలో స్థానికంగా లేకుంటే సరుకులు అందేవి కావు. దీనిని ఆసరాగా చేసుకుని కొందరు సరుకులు పక్కదారి పట్టించేవారు.



సరుకులు అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

దీనికి ఇప్పుడు అడ్డుకట్ట పడింది. సరుకులు ఇచ్చే సమయానికి కేంద్రాలకు రాలేని గర్భిణీలు ఎక్కడ ఉంటే ఆ సమీపంలోని అంగన్‌కేంద్రంలో కార్యకర్త ఫోన్‌లో యాప్ ఓపెన్ చేసి ముఖ ఆధారిత గుర్తింపు, లేదా వేలిముద్ర వేసి పోషకాహారం పొందవచ్చు. వలస వెళ్ళిన వారు సైతం ఎక్కడైతే నివాసం ఉంటున్నారో అక్కడే అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పోషణ సరుకులు తీసుకోవచ్చు. ముందుగా సమాచారం ఇస్తే ఎక్కడ ఉంటే అక్కడ అంగన్‌వాడీ కార్యకర్తలు మైగ్రేషన్ ఆప్షన్‌తో సేవలు అందిస్తారు. లబ్ధిదారులకు ఇది ఎంతో సౌలభ్యం.

పుట్టింటికి వెళ్లినా సరుకులు తీసుకోవచ్చు



ఉపాధి కోసం కొందరు ఇతర జిల్లాలకు, మండలాలకు వలస వెళుతుంటారు. వెళ్ళిన వాళ్ళు మూడు, నాలుగు నెలలు అక్కడే ఉంటుంటారు. అలాగే గర్భిణీలు, బాలింతలు పుట్టింటికి వెళతారు. వీరంతా ఎక్కడైతే ఉంటారో ఆ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో సరుకులు పొందవచ్చు. గర్భిణీలు, బాలింతలు, శిశువులు, ఆరు సం వత్సరాల్లోపు చిన్నారుల వివరాలను ఇటీవలే అంగన్‌వాడీ కార్యకర్తలు యాప్‌లో నమోదు చేశారు. ఎక్కడైనా ఒకచోట పోషణ్ తీసుకుంటే మరోచోట యాప్ అంగీ కరించదు.

\- విజయలక్ష్మి, సీడీపీవో, వెంకటాచలం

జెన్కో నిర్వాసితుల సమస్యలు పట్టించుకోరా?

● అధికారులను నిలదీసిన టీడీపీ నాయకులు



వినతి పత్రం అందజేస్తున్న టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునయాదవ్

ముత్తుకూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : థర్మల్ కేంద్ర నిర్మాణం కోసం తమ భూములను ఇచ్చిన నిర్వాసితుల సమస్యలను పట్టించుకోవడం లేదంటూ ముత్తుకూరు, టీపీగూడూరు మం డలాల టీడీపీ అధ్యక్షులు నీలం మల్లికార్జున్‌యాదవ్, సన్నారెడ్డి సురేష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నేలటూరు లోని జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రం సీఈ జగన్నాథ్‌ను కలిసి నిర్వాసిత గ్రామాల ప్రజల సమస్య లపై వినతిపత్రం అందజేశారు. జెన్కో సీఈను కలిసేందుకు వచ్చిన టీడీపీ నాయకులను థర్మల్ కేంద్రం గేటు వద్ద ఎస్‌పీఎఫ్ సిబ్బంది అడ్డుకున్నారు. అయితే గేట్లు తీసుకుని టీడీపీ నాయకులు పరిపాలన భవనం వద్దకు వెళ్లగా, కార్యాలయంలో తలుపులు మూసేసి ఎస్‌పీఎఫ్ సిబ్బంది వారిని మరోసారి అడ్డుకున్నారు. గంట పాటు అనుమతుల పేరుతో బయటే ఎండలో నిలబెట్టడంతో టీడీపీ నాయకులు ఎస్‌పీఎఫ్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భం గా జరిగిన తోపులాటలో కార్యాలయ ద్వారం అద్దం పగిలిపోయింది. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. అనంతరం నీలం మల్లికార్జున యాదవ్, సన్నారెడ్డి సురేష్‌రెడ్డి సీఈని కలిశారు. పునరావాసం, థర్మల్ కాలు ష్యం, స్థానికులకు ఉద్యోగ అవకాశాలపై నిల దీశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాచిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కొత్తపల్లి రమేష్, పల్లికొండ శీనయ్య, ఈశ్వరయ్య, జనార్ధన్, శ్రీనివాసులు, మోహన్ రావు, శోభన్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న 40 కుటుంబాలు



సోమిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన విరువూరు గ్రామస్థులు

పొదలకూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని విరువూరు గ్రామంలో వైసీపీని వీడి 40 కుటుంబాలవారు గురువారం సోమిరెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ కండువా కప్పుకున్న వారిలో కొల్లి రాజారెడ్డి (మాజీ ఎంపీటీసీ), నందూరు మల్లికార్జునరెడ్డి, పిట్టు పెంచలరెడ్డి, దయాకర్‌రెడ్డి, పగడాల మధు, బట్టంశెట్టి మురళీ, బోడెద్దుల నాగయ్య, సిద్ధం శింగయ్య, సూదరగుంట సుబ్బారెడ్డి, కొప్పోలు బ్రహ్మయ్య, గంగపట్ల రవీంద్ర, రాగిపాటి శ్రీనివాసులు, మొత్తంగా 40 కుటుంబాలు వారున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వ పాలన, స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సర్వేపల్లి నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని చూసి తెలుగుదేశం పార్టీలోకి చేరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యద్దల ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ డేగా జగన్‌మోహన్, యద్దల అజయ్‌రెడ్డి, డేగ రవిరాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

● జనసేన పార్టీలోకి 30 కుటుంబాల చేరిక

వెంకటాచలం : ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణీభవాని ఆధ్వర్యంలో సర్వేపల్లి నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు సమక్షంలో 30 గిరిజన కుటుంబాలు జనసేన పార్టీలో చేరాయి. వెంకటాచలంలోని జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం వీరికి పార్టీ కండువాలు కప్పి సాదారంగా పార్టీలోకి ఆహ్వానించారు. సురేష్‌నాయుడు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం, పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌పై అభిమానంతో పవన్ వెంట నడిచేందుకే గిరిజనులు జనసేనలో చేరినట్లు తెలిపారు. గిరిజనుల సమస్యలను సాధ్యమైనంతవరకూ పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జనసేన నేతలు సందూరి శ్రీహరి, పొట్లూరు సుబ్రహ్మణ్యం, షేక్ రహీమ్, అక్బర్, చిన్న, రాణమ్మ, చార్మి, నర్సమ్మ, వసంత, శారద, సుబ్బరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఆగిన గణేశ్ నిమజ్జనాలు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): వర్షానికి మండలంలో పలు చోట్ల బుధవారం రాత్రి నిర్వహించాల్సిన గణేష్ నిమజ్జనోత్సవాలు ఆగిపోయాయి. దీంతో విగ్రహం తడిసిపోకుండా పట్టలు కప్పి జాగ్రత్తలుపడ్డారు. దీంతో జొన్నవాడలోని పోలేరమ్మ గుడి వద్ద నెలకొల్పిన గణేష్ విగ్రహానికి గురువారం ఉదయం నుంచి గ్రామోత్సవంతో ఊరేగించి మధ్యాహ్నం జొన్నవాడ పెన్నానదిలో నిమజ్జనం చేశారు. గణేష్ విగ్రహానికి చేసిన ప్రత్యేక పుష్పాలంకరణ అలరించింది. ఊరేగింపులో ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఉత్సాహంగా ఉట్టి మహోత్సవం

సాయంత్రం జొన్నవాడ ఆలయం వెనుక వీధిలో నెలకొల్పిన గణేష్ విగ్రహం వద్ద ఉట్టి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

వీఎస్‌యూలో గ్లాస్ అండ్ గ్లాసింగ్ స్కిల్ సెంటర్

వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు



మాట్లాడుతున్న వీసీ శ్రీనివాసరావు

వెంకటాచలం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో గ్లాస్ అండ్ గ్లాసింగ్ స్కిల్ సెంటర్ స్థాపనకు సం బంధించి చర్చలు విజయవంతమయ్యాయి. మహారాష్ట్రలోని ముంబైలో అఖిల భారత గ్లాస్ మాన్యు ఫాక్చరర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఫెడరేషన్ సభ్యులు వీఎస్‌యూతో ఎంఓయూ చేసుకోవడానికి అంగీకరించినట్లు తెలిపారు. ఈ స్కిల్ సెంటర్ ద్వారా విద్యార్థులకు గ్లాస్ పరిశ్రమలో అవసరమైన నైపుణ్యాలు అందించ వచ్చన్నారు. ప్రపంచ వ్యాప్తంగా గ్రీన్ హౌస్ ఎఫెక్ట్ కారణంగా గ్లాస్ పరిశ్రమలో ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు.

ఘనంగా వినోబా భావే జయంతి

ఇందుకూరుపేట, సెప్టెం బరు 11 (ఆంధ్రజ్యోతి) : మం డలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రా రెడ్డి, నెల్లూరు జిల్లా సర్వోద య మండలి ఆధ్వర్యంలో గురువారం ఆచార్య వినోబా భావే జయంతిని ఘనంగా నిర్వ హించారు. ఆచార్య వినోబా భావే చిత్ర పటానికి నెల్లూరు జిల్లా సర్వోదయ మండలి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షుడు రత్నరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆశ్రమ కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి మాట్లాడుతూ ఆచార్య వినోబా భావే పాత్ర భారతదేశ స్వాతంత్ర్య చరిత్రలో స్ఫూర్తిదాయకమన్నారు. మహాత్మా గాంధీకి అత్యంత సన్నిహితుడని, గాంధీజీని కలిసిన తర్వాత తన జీవిత లక్ష్యాలను అంకితభావంతో నిర్వర్తించారన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరుజిల్లా సర్వోదయ మండలి డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ అంకయ్య, ఆశ్రమ మేనేజర్ మనోజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కావలి పీజీ క్యాంపస్‌లో బీఫార్మసీ కోర్సు ప్రారంభం

వెంకటాచలం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ ఆధ్వర్యంలో కావలి పీజీ క్యాంపస్‌లోని వీఎస్‌యూ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్తగా బీఫార్మసీ కోర్సును ప్రారంభించినట్లు వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని బీఫార్మసీ కోర్సును ఈ ఏడాది నుంచి ప్రవేశపెట్టినట్లు చెప్పారు. విద్యార్థులు ఏపీఈఏపీ సెట్ 2025 కౌన్సిలింగ్‌లో వీఎస్‌యూ పీఎస్ఎఫ్ కళాశాల కోడ్ పీహెచ్ఎం కోర్సును వెబ్ ఆప్షన్‌లో ఎంచుకుని చేరవచ్చన్నారు. నాలుగేళ్ల బీఫార్మసీ కోర్సు ఫీజు ఏడాదికి రూ.60 వేల రుపాయలు అని, ఫీజు రియంబర్స్మెంట్‌కి అర్హులైన విద్యార్థులు ఈ కోర్సును ఉచితంగా అభ్యసించవచ్చన్నారు.

గిరిజన కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందచేస్తున్న మన్నెమాల కుటుంబీకులు

మనుబోలు, సెప్టెంబరు 11 (ఆంధ్ర జ్యోతి): మండ లంలోని గిరిజన కుటుంబా నికి టీడీపీ నాయకులు మన్నెమాల భాస్కర్‌రెడ్డి గురువారం ఆర్థిక సాయం అందిం చారు. బుధవారం గ్రామం లోని గిరిజన కాలనీలో వెందో టి పోలయ్య, వెందోటి కొండయ్యకు చెందిన రెండు పూరిళ్ళు విద్యు దాఘాతంతో అగ్నికి ఆహుతైన విషయం విదితమే. దీంతో గిరిజన కుటుం బాలను ఆదుకునేందుకు మన్నెమాల ముందుకు వచ్చారు. అందుబాటులో ఉన్న వెందోటి పోలయ్య కుటుంబానికి రూ. 10వేలు ఆర్థిక సాయం అందించారు. కొండయ్య కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మన్నెమాల శ్రీనువాసులు రెడ్డి, మన్నెమాల ఆదినారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ పెంచలయ్య, భక్తవత్సలరెడ్డి పాల్గొన్నారు.

ఉదయగిరి పంచాయతీలో ఆడిట్

ఉదయగిరి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): 2024- 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉదయగిరి గ్రామ పంచాయతీలో చేప ట్టిన జమ, ఖర్చుల నిర్వహణపై సోమవారం జిల్లా ఆడిట్ అధికారులు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఆడి టర్ మనూజ, సీనియర్ ఆడిట్ అధికారి కోటేశ్వరరావులు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అన్ని రికార్డులను పరిశీలించి ఆడిట్ నిర్వహించడం జరిగిందన్నారు.

నీట మునిగిన వరి .. ఆందోళనలో రైతులు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): కుండపోత వర్షానికి వరి తడిసిపోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. కోతకు సిద్ధంగా వున్న వరి చేలు వర్షం నీటిలో నేలకొరిగిపోవడం చూసి తీవ్ర ఆందోళనకు గురయ్యారు. నీటమునిగిన పంటను కాపాడుకునేందుకు పొలాల్లో చేరిన నీటిని బయటకు తీసే ప్రయత్నాల్లో మునిగిపోయారు. దీంతో బుచ్చి మండలంతోపాటు జిల్లా వ్యాప్తంగా వరికోతలు ఆగిపోయాయి. బుధవారం కోసిన ధాన్యాన్ని రైతాంగం రోడ్ల వెంబడి రాశులుగా పోసి పట్టలు కప్పారు. అవికూడా తడిసి ముద్దయ్యాయి. దీంతో ధాన్యం అమ్ముకోవడానికి రైతులు నానా అవస్థలు పడ్డారు. ధాన్యం కొంచెం తడెక్కడంతో మిల్లర్లు, దళారుల్లో ధాన్యం ధరలపై అభ్యంతరాలు వ్యక్తమౌతున్నాయి. తడిసిన ధాన్యానికి అదనంగా బస్తాకు తరుగును కేజీ నుంచి 2 కేజీలు పెంచారు. ఐనా ధాన్యం అమ్ముకోక తప్పలేదు. రెడ్డిపాళెంలో రోడ్లపైన వందల పుట్లు ధాన్యం రాశులు పోసుకున్న రైతాంగం అమ్ముకునేందుకు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. గురువారం సాయంత్రానికి 733 రకం ధాన్యం ధర రూ. 15,000, 1010 రకం ధాన్యం రూ.14000, 1638 రకం ధాన్యం రూ.16,300 నుంచి రూ.16,500 వుంది. రేపటి ధరల పరిస్థితి ఎలా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.



పెనుబల్లి, మినగల్లు మధ్య భారీ వర్షానికి నీట మునిగిన వరిపైరు



విద్యుదాఘాతానికి గురై నలుగురు కూలీలకు తీవ్ర గాయాలు

జలదంకి, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మలపాలెంలోని కెవిఆర్ కన్వెన్షన్ వద్ద గురువారం విద్యుదాఘాతానికి గురై నలుగురు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. కన్వెన్షన్ ఆర్చి మరమ్మతు పనులు చేస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. కూలీలు ట్రాలీ నిచ్చెనను పక్కకు జరుపుతుండగా అక్కడే ఉన్న 11 కెవి విద్యుత్ వైర్లను ట్రాలీ తగలడంతో నలుగురు కూలీలు విద్యుదాఘాతానికి గురై గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం కన్వెన్షన్ సెంటర్ సూపర్‌వైజర్ కావలి ఏరియా వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

● కందుకూరులో యువకుడి మృతి



మృతిచెందిన వెంకటచైతన్య

కందుకూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుడం గుంటకాలనీకి చెందిన తలపల వెంకట చైతన్య (23) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కార్పెంటర్ సహాయకునిగా పనిచేస్తున్న ఈ యువకుడు పట్టణంలోని పడమర వడ్డె పాలెంలో నూతనంగా నిర్మి స్తున్న ఓ ఇంట్లో ఉడ్ ఎలక్ట్రిక్ డ్రిల్లింగ్ మిషన్‌తో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాకుతో బుధ వారం రాత్రి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు తమకు న్యాయం చేయాలని గురువారం ఆందోళన చేపట్టారు. పట్టణ ఎస్ఐ శివనాగ రాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదంగా యువతి...



మృతిచెందిన సనా

దుత్తలూరు (ఉదయగిరి), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటంపేట గ్రామ బీసీ కాలనీకి చెందిన పఠాన్ సనా (17) అనే యువతి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకొంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పఠాన్ ఖాదర్‌బాషా, నాజున్నీసాల పెద్ద కుమార్తె సనా దుత్తలూరు ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం వరకు చదివి ఇంట్లోనే ఉంటోంది. అనారోగ్యంగా ఉండడంతో గురువారం భార్యాభర్తలు ఉద యగిరి వైద్యశాలకు వెళ్లారు. అనంతరం తిరిగి ఇంటికెళ్లి చూడగా కుమార్తె సనా కిందపడి అపస్మారక స్థితిలో ఉండడంతో హుటా హుటిన ఓ ఆటోలో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారిం చారు. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆదిలక్ష్మి తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన చల్లా రాము

సంగం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కలిగిరి రహదారికి సమీపంలో అటవీ ప్రాంతంలో గురువారం ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్లిన పశువుల కాపరులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో వెళ్లి పరిశీలించారు. మృతుడు స్థానిక రాళ్లచెలిక ప్రాంతానికి చెందిన ఆటోడ్రైవర్ చల్లా రాము (42)గా పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యు లకు సమాచారం అందించారు. కుటుంబంలో ఎటువంటి సమస్యలు లేవని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. పోస్టుమార్టం నిమి త్తం రాము మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తర లించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెండు మోటార్ బైక్‌ల ఢీ


● ఒకరు మృతి.. మరొకరికి గాయాలు



సాయిసూర్య మృతదేహం

కావలి రూరల్, సెప్టెంబరు 11: ముందు వెళ్తున్న మోటారు బైక్‌ను వెనుక వస్తున్న మరో మోటారు బైక్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరికి గా యాలైన సంఘటన ముసు నూరు జాతీయ రహదారిపై గురువారం జరిగింది. స్థానికులు, బాధితుల వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా శింగరాయకొండ గోపాల్‌నగర్‌కు చెందిన రొండా సాయి సూర్య (27) లిక్కర్ ఫ్యాక్టరీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం సాయిసూర్య బుచ్చి మండలం ఎల్లాయపాలెంలో బంధువుల కర్మక్రియల్లో పాల్గొని అనంతరం మోటారుబైక్‌పై శింగరాయకొండకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని ముసునూరు జాతీయ రహదారి బ్లూమూన్ డాబా సమీపంలోకి వచ్చేసరికి గౌరవరానికి చెందిన ఉప్పు నాగరాజు మోటారుబైక్‌పై గౌరవరం నుంచి కావలికి వస్తుండగా బైక్ వెనుక వైపున సాయిసూర్య మోటారుబైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగరాజుకు స్వల్ప గాయాలు కాగా సాయిసూర్య అక్కడికక్కడే మృతిచెందాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మట్టి తరలిస్తున్న వాహనాల సీజ్



స్టేషన్ ఆవరణలో ఉన్న మట్టి ట్రాక్టర్లు

కావలి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కావలి రూరల్ మండలం ఆముదాలదిన్నె చెరువులో అక్రమంగా మట్టిని తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు, ఒక ఎక్స్‌కావేటర్‌ను గురువారం మధ్యాహ్నం విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. ఒంగోలు విజిలెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ రామచంద్ర ఆదేశాల మేరకు విజిలెన్స్ టెక్నికల్ అసిస్టెంట్‌లు తిరుపతి రావు, హరిబాబులు సాధారణ తనిఖీలు చేపట్టారు. మట్టి తరలిస్తున్న వాహనాలను సీజ్‌చేసి కావలి రూరల్ పోలీసులకు అప్పగించారు.

బీరు బాటిల్‌తో దాడి

కావలి రూరల్, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): రుద్రకోటలోని విక్కి వైన్స్ సూపర్‌వైజర్ జరుగుమల్లి సందీప్‌పై కొందరు వ్యక్తులు గురువారం బీరు బాటిల్‌తో దాడి చేశారు. గుడ్లూరుకు చెందిన ముగ్గురు వ్యక్తులు క్యాషియర్‌గా పని చేస్తున్న హరితో గొడవ పడుతుండగా, అక్కడికొచ్చిన కొందరు సందీప్‌పై బీరు బాటిల్‌తో దాడి చేశారు. గాయపడిన సందీప్‌ను కావలి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బ్లేడుతో : కావలి పట్టణంలోని తుఫాన్ నగర్‌కు చెందిన ఉప్పాల వంశీపై గురువారం జంగాల కాలనీ సమీపంలో దావులూరు కొండయ్య, అక్కిలిగుంట ఎలేషా మరికొందరు బ్లేడుతో దాడి చేశారు. గాయపడిన వంశీని ఏరియా వైద్యశాలకు తరలించారు. వంశీ బంధువులకు అదే ప్రాంతానికి చెందిన దేవరకొండ సుధీర్‌కు మధ్య రెండు రోజుల క్రితం గొడవ జరిగింది. ఈ గొడవలో వంశీ సుధీర్ వైపు నిలబడటమే దాడికి కారణమని బాధితుడు తెలిపాడు. రెండవ పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	136
స్కిన్ చికెన్	242
స్కిన్‌లెస్	266
కోడిగుడ్ల ధర (100):	550

బీమా నగదు అందజేత

నెల్లూరురూరల్,సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి) : నెల్లూరురూరల్లోని గుడిపల్లిపాడుకి చెందిన రావినూతల బాబు ఇటీవల మరణించారు. కాగా ఆయన జనసేనపార్టీలో కొనసాగుతున్న నేపథ్యంలో క్రియాశీలక సభ్యత్వం తాలూకు నగదును ఆ పార్టీ నేత, టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్ బాధిత కుటుంబానికి అందచేశారు. గురువారం బాబు కుటుంబాన్ని పరామర్శించిన బీమా నగదు రూ. 5 లక్షలు అందచేశారు. తమ పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఆదేశాలనుసారం బీమా నగదు అందచేసి బాబు కుటుంబానికి అండగా నిలిచామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూనె మల్లికార్జున్, రామిరెడ్డి, కిషోర్, జమీర్, శేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు మేకల అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబంతో జనసేన పార్టీ నాయకులు

వేతన బకాయిలు చెల్లించరా...?

● మంత్రి ఇచ్చిన హామీలు ఏమయ్యాయి ? ● ఆందోళనలో జీజీహెచ్ సెక్యూరిటీ గార్డులు

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న జీజీహెచ్ సెక్యూరిటీ గార్డుల వేతన బకాయిలు ఐదేళ్లుగా అందలేదు. దీంతో వారికి ఎదురుచూపులే మిగిలాయి. 'మీ వేతనాలకు ఎలాంటి ఢోకా లేదు. మీకు మేము హామీ ఇస్తున్నాం. ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వెంటనే బకాయిలు చెల్లించేలా అధికారులకు ఆదేశాలు ఇస్తున్నాం'... అని గత వైసీపీ ప్రభుత్వంలో మంత్రులు హామీ ఇచ్చారు. కానీ అవినెరవేరలేదు.అయితే ప్రస్తుతం సీన్ మారింది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటింది. అయినా వారికి బకాయిలు నేటికీ అందలేదు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేదు. జీజీహెచ్‌లో 134 మంది సెక్యూరిటీ గార్డులు పని చేస్తున్నారు. 2019లో తిరుపతికి చెందిన బాలాజీ సెక్యూరిటీ ఏజెన్సీస్ వీరి నిర్వహణ చేపట్టేది. అయితే గత ఏడాది సెప్టెంబరుతో ఆ ఏజెన్సీ నిర్వహణ బాధ్యత ముగిసింది. అయినా సెక్యూరిటీ గార్డులు కొనసాగుతూనే ఉన్నారు. 2020లో సాలమన్ ఏజెన్సీకి వీరి నిర్వహణ బాధ్యతను అప్పగించారు. 2019 అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలలకు ఏ ఏజెన్సీకి కూడా సెక్యూరిటీ బాధ్యతలు అప్పగించ లేదు. దీంతో జీజీహెచ్ ఆ వేతనాలు చెల్లించాల్సి ఉంది. గత ఏడాది వైద్య కళాశాలకు డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరసింహ వచ్చిన సందర్భంలోనూ సెక్యూరిటీ గార్డులు కలిశారు. అయితే సమస్యలు తెలుసుకుంటున్నారే గాని పరిష్కారం మాత్రం కాలేదు. మొత్తం రూ. 34.57 లక్షల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది.



సమస్యను పరిష్కరించాలి



ప్రస్తుతం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను సెక్యూరిటీ గార్డులు కలిశారు. ఆయన సమస్యను పరిష్కరిస్తామన్నారు. అయినా వేతన బకాయిలు మాత్రం నేటికి చెల్లించలేదు. ఎప్పుడు బకాయిలు వస్తాయే చెప్పలేని దుస్థితి ఇక్కడ నెలకొంది.

- నరమాల సతీష్‌కుమార్, యునైటెడ్ మెడికల్ హెల్త్ యూనియన్ గౌరవాధ్యక్షుడు

అప్పులు ఇచ్చే వారు లేరు..



దాదాపు ఐదేళ్లుగా బకాయిలు చెల్లించలేదు. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. మంత్రులు, అధికారులను కలిసినా నేటికి సమస్య పరిష్కారం కాలేదు. వెంటనే ప్రభుత్వం స్పందించి బకాయిలు చెల్లించాలి.

-శామ్యూల్, జీజీహెచ్ సెక్యూరిటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

3 నెలల బకాయిలు ఇంతవరకు రాలేదు



కరోనా కాలంలో ప్రాణాలకు తెగించి బాధ్యతలు నిర్వహించాం. అయితే 2019లో 3 నెలలు బకాయిలు నేటికీ రాలేదు. వేతన బకాయిలు చెల్లించాలని కోరుతున్నా ఫలితం ఉండటం లేదు. కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం ఉండటం లేదు.

- రామాంజనేయులు, జీజీహెచ్ సెక్యూరిటీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి



రెవెన్యూ సదస్సులతో సమస్యల పరిష్కారం

● కృష్ణప్రసాద్, రూరల్ తహసీల్దారు

నెల్లూరురూరల్,సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి) : నెల్లూరురూరల్లోని గ్రామీణ ప్రాంతాల్లో ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో పలు సమస్యలకు పరిష్కారం దొరికిందని తహసీల్దారు కృష్ణప్రసాద్ అన్నారు. జఠిలమైన సమస్యలను రెవెన్యూ బృందం స్వయంగా పరిశీలించడానికి ఈ సదస్సులు ఎంతగానో దోహదపడినట్లు ఆయన చెప్పారు.

? : 18 గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో ఎన్ని సమస్యలు మీ దృష్టికి వచ్చాయి.

! : సుమారుగా 340 సమస్యలు మా దృష్టికి వచ్చాయి. వాటిల్లో అత్యధికంగా అడంగళ్‌లో పేర్లు మార్పు, తప్పులు వంటివే ఉన్నాయి. అన్నింటినీ పరిష్కరిస్తున్నాం.

? : రీ సర్వేతో సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.

! :రీసర్వే సమయంలో ఉత్పన్నమైనవి ఎక్కువగా ఉన్నాయి. కుటుంబ కలహాలతో నెలకొన్నవి మరిన్నీ. బాధితులకు వివరంగా చెప్తున్నాం.

? : అసైన్డ్ భూమి రైతుల సమస్యలపై...

! : కొన్ని అభ్యంతరాలు ఉన్న భూములు తప్ప మిగిలినవాటిల్లో స్వయంగా పరిశీలించి అసైన్‌మెంట్ కమిటీకి సిఫార్సు చేస్తున్నాం. బీడు భూముల జోలికి వెళ్లడం లేదు.

? : వీఆర్వోలు గ్రామాల్లో ఉండటం లేదన్నది దానిపై ఏమంటారు.

! : సర్వేలు ఎక్కువగా ఉన్నాయి. వాటిల్లో వారంతా బిజీగా ఉన్నారు. అందువల్ల ప్రజలు ఎవరైనా వెళ్లినప్పుడు వీఆర్వో కనపడకపోతే అందుబాటులో లేరని అనుకుంటున్నారు.

విశ్రాంత ఉద్యోగులను ఆదుకోవాలి

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగులను సీఎం చంద్రబాబు ఆదుకోవాలని భారత్ సేవా ఫౌండేషన్ కార్యదర్శి షేక్ ఖాసీం గురువారం ఒక ప్రకటనలో కోరారు. జీవిత చరమాంకంలో ఉన్న విశ్రాంత ఉద్యోగుల ప్రాణాలు ఎప్పుడు పోతాయో వారికే తెలియని పరిస్థితిలో ఉన్నారన్నారు. ఈ పరిస్థితిలో వారికి రావాల్సిన డీఏ, పీఆర్సీ బకాయిలను చెల్లించాలన్నారు. అనంతపురంలో సభలో దసరా కానుకగా ఆటో డ్రైవర్లకు ఒక్కొక్కరికి రూ.15వేలు ఇస్తామని సీఎం ప్రకటించటం హర్షదాయకమన్నారు. అలాగే విశ్రాంత ఉద్యోగులకు కూడా సీఎం మంచి మనసు చేసుకుని బకాయిలు చెల్లించాలని కోరారు.

మిడతల లక్ష్మి సన్మానం


మిడతల లక్ష్మిని సన్మానిస్తున్న బాలాజీ, రమేష్ తదితరులు

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ కమిటీ సభ్యురాలిగా ఎన్నికైన మిడతల లక్ష్మిని చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ శాలువా కప్పి సన్మానించారు. గురువారం నగరంలోని ఆమె స్వగృహంలో కమిటీ సభ్యులతో కలిసి ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సన్మానించారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు మిడతల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్టు లారీ బోల్తా డ్రైవర్‌కి గాయాలు

కావలి రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి ఢిల్లీకి వెళ్తున్న వీఆర్ఎల్ ట్రాన్స్‌పోర్టు లారీ గురువారం తెల్లవారుజామున కావలి పట్టణ వెంగయ్యగారిపాలెం క్రాస్ రోడ్డు సమీపంలో అదుపుతప్పి జాతీయ రహదారి పై ఓవర్ బ్రిడ్జి రైలింగ్‌ను ఢీకొని సర్వీస్ రోడ్డులో బోల్తాపడింది. రాత్రి సమయం కావటంతో వాహనాలు రాకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సౌకత్ అలికి తీవ్రగాయాలు కావటంతో 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు.

నిరుపయోగంగా మూత్రశాలలు

దాతల సొమ్ము వృథా

నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంగా ఏర్పడిన సమయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నగర సుందరీకరణం చేస్తున్నట్లు ప్రకటించారు. నగరపాలక హోదా రావడంతో నెల్లూరు రూపురేఖలు మారిపోతాయని, మెరుగైన సౌకర్యాలు లభిస్తాయని ప్రజలు కలలుగన్నారు. పదేళ్లకుపైగా అయినా నగరంలో రూపురేఖలు మారలేదు. ప్రజల సమస్యలు తీరలేదు. నగరం సుందరీకరణలో భాగంగా బహిరంగ మూత్ర విసర్జన నిరోధించేందుకు మూత్రశాలలు, మరుగుదొడ్లు జనంరద్దీ ప్రాంతాల్లో వారి దాతలు సొంతనిధులతో నిర్మించారు. కొండాయపాలెంగేటు, సర్వోదయ కళాశాల, మరికొన్ని ప్రాంతాల్లో భారీగా నిధులు వినియోగించి నిర్మించారు. వాటిని నగర పాలక సంస్థకు అందజేశారు. దాతలు ఆశయాల మేరకు వాటిని ప్రజలకు ఉపయోగించేలా చర్యలు తీసుకోకపోగా, వాటికి తాళం వేశారు. కొన్ని మరుగుదొడ్ల చుట్టూ ఆక్రమణలు పెరిగిపోయాయి. వాటిని నగర పాలక సంస్థ వినియోగంలోకి తేకపోవడంతో ప్రజలు వాటి పక్కనే బహిరంగ మూత్ర విసర్జన చేస్తున్నారు.ఇప్పటికైనా వాటిని వినియోగంలోకి తీసుకురావాలి.



సర్వోదయ కళాశాల ముందు నిరుపయోగంగా ఉన్న మూత్రశాలలు

9,314 గృహాలు ప్రవేశాలకు సిద్ధం

● పూర్తికావస్తున్న ఇళ్ల నిర్మాణాలు ● నెరవేరనున్న పేదల కల

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నిరుపేదల సొంతింటి కల నెరవేరనుంది. వైసీపీ హయాంలో కేవలం ఆర్భాటాలకే పరిమితమై, నిర్లక్ష్యానికి గురైన గృహనిర్మాణం గత ఏడాదిన్నర కాలంగా వేగం పుంజుకుంది. దీంతో ప్రభుత్వం ఎప్పుడు మహూర్తం ఖరారుచేస్తే అప్పుడు లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 82,422 గృహాలను గత ప్రభుత్వంలో మంజూరవగా, 26వేలకుపైగా గృహాలను అప్పట్లో పూర్తిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత పాలనలో జరిగిన పక్కాగృహాలలో అవినీతి, అక్రమాలను వెలికి తీయడంతోపాటు మంజూరైన గృహాలను త్వరితగతిన పూర్తిచేసి పేదలకు అందించేందుకు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి జిల్లాలో పర్యటించి పక్కాగృహాల నిర్మాణాలపై అధికారులతో సమీక్షించారు. నాణ్యతగా ఇళ్లను నిర్మించి పేదలకు అందించాలని సూచించారు. రానున్న దసరాకు లేదా జనవరిలో తొలివిడత గృహప్రవేశాలు చేపట్టాలని జిల్లా అధికారులకు లక్ష్యాన్ని నిర్దేశించారు. మంత్రి ఆదేశాలతో అధికారుల్లో కదలిక మొదలై గృహ నిర్మాణాల్లో వేగం పెంచారు. శ్లాబ్‌లను పూర్తిచేసుకుని 9,314 ఇళ్లకు అన్ని పనులు పూర్తికావస్తున్నాయి. దీంతో ప్రభుత్వం ఎప్పుడు మహూర్తం నిర్ణయించినా లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.

నియోజకవర్గం	ఇళ్లు
కావలి	1,599
సర్వేపల్లి	1,538
ఉదయగిరి	1509
ఆత్మకూరు	1,327
కోవూరు	1,086
కందుకూరు	908
నెల్లూరు రూరల్	409
నెల్లూరు సిటీ	270
వెంకటగిరి	668
మొత్తం	9,314


వెంకటాచలంలో పూర్తయిన పక్కాగృహాలు

బాలికపై అత్యాచారం

● సచివాలయ ఉద్యోగిపై కేసు నమోదు

ఉలవపాడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో పిల్లల ఆలనాపాలన చూస్తున్న మైనర్ బాలికపై కామవాంఛ తీర్చుకున్న ఓ సచివాలయ ఉద్యోగిపై పోక్సోతోపాటు పలు సెక్షన్ల కింద గురువారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అంకమ్మ తెలిపారు. ఇందుకూరుపేట మండలం, మైపాడు సమీపంలోని కోడూరుకు చెందిన తొమ్మిదేళ్ల బాలికను తల్లిదండ్రులు కావలి సమీపంలోని ఏనుగుల బావి గ్రామానికి చెందిన కొండయ్యకు నాలుగేళ్ల క్రితం కూలి పన ులు చేయడానికి అప్పగించారు. అప్పటి నుంచి బాలిక తల్లిదండ్రులు కొండ య్య వద్ద నుంచి ప్రతిఏటా కొంత డబ్బు తీసుకునేవారు. బాలికతో బాతుల సంరక్షణతోపాటు ఇంట్లో పనులు చేయిస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో ఉలవపాడులో కాపురం ఉంటున్న తన కూతురు ఇంటికి పిల్లల ఆలనాపాలన చూసేందుకు కొండయ్య గత ఏడాది ఆ బాలికను పంపించాడు. ప్రస్తుతం ఆ బాలికకు 13 ఏళ్లు. కొండయ్య అల్లుడు పొట్టిరాజు (రామకృష్ణ) సింగరాయకొండ సచివాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్నాడు. అయితే పొట్టిరాజు సదరు బాలి కపై గత 20 రోజుల వ్యవధిలో 3 సార్లు అత్యాచారం చేశాడు. దీంతో భయభ్రాంతులకు గురైన బాలిక ఇంటి నుంచి బయటకు వచ్చేసింది. చాగొల్లు పరిస ర ప్రాంతంలో తిరుగుతుండగా కోటేశ్వరమ్మ అనే మహిళ గమనించి బాలిక వివరాలు కనుక్కుని పోలీసులకు అప్పగించింది. జరిగిన ఘటనను బాలిక విచారణాధికారులకు వివరించింది. బాలిక ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా కొండయ్య, అతని భార్య, పొట్టిరాజు, అతని భార్య, బాలిక తల్లిదండ్రులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. బాలికను కొడవలూరు మండలం నార్త్‌రాజుపాలెంలోని విశ్వజనని బాలికల ఆశ్రమానికి పంపించారు.

వినాయక నిమజ్జన ఊరేగింపు అడ్డగింత

● పోలీసుల తీరుపై ప్రజల ఆగ్రహం

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక కామాక్షికాలనీ రెండో వీధిలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమ నిమజ్జన ఊరేగింపును గురువారం రాత్రి జొన్నవాడ సెంటర్‌లో పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల తీరును వ్యతిరేకిస్తూ స్థానికులు అక్కడకు చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఊరేగింపులకు అనుమతి ఇచ్చిన పోలీసులు తీరా ఇప్పుడు అభ్యంతరం చెప్పడమేమిటంటూ ముంబాయి జాతీయ రహదారిని దిగ్బంధించారు. దీంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇంతలో ఎస్ఐ సంతోష్‌రెడ్డి ఊరేగింపునకు అనుమతించడంతో అంతా శాంతించారు. అయితే డీజే ఇస్తేనే ఊరేగింపు చేస్తామని యువత పట్టుబట్టారు. మొత్తానికి సమస్య సర్దుమణిగిందని ఎస్ఐ తెలిపారు.

లోకేష్ కృషి ప్రశంసనీయం : వీపీఆర్

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నేపాల్‌లో చిక్కుకున్న 215 మంది తెలుగువారిని రక్షించేందుకు ప్రత్యేక ప్రణాళికతో మంత్రి నారాలోకేష్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఓ సంయుక్త ప్రకటనలో అన్నారు. నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారిని రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ఇందుకోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నిరంతరం పనిచేస్తున్నారన్నారు. మంత్రి నారా లోకేష్ సూపర్ హిట్ సభను రద్దు చేసుకొని కమాండ్ కంట్రోల్ ద్వారా సహాయక చర్యలు చేపట్టారని వారు వివరించారు.

విజేతలకు బహుమతులు

బిట్రగుంట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): టెన్నిస్ టోర్నమెంట్‌లో బోగోలు మండల విద్యుత్ శాఖ ఏఈ వీసీ జడరాయ, కొండాపురం లైన్‌మెన్ ఎన్ శ్రీనివాసులురెడ్డి విజేతలుగా నిలిచి బహుమతులు అందుకున్నారు. ఏపీ ఎలక్ట్రిసిటి కార్పొరేషన్ గుంటూరులో ఈనెల 9వ తేదీ నుంచి 11 వరకు టెన్నిస్, బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించారు. నెల్లూరు సర్కిల్ టెన్నిస్ జట్టు నుంచి జడరాయ, శ్రీనివాసులు పోటీలో ప్రత్యర్థులతో తలపడి ద్వితీయ స్థానం సాధించారు. అలాగే ఓపెన్ సింగిల్ కేటగిరిలో నెల్లూరు నుంచి వీసీ.జడరాయ, గుంటూరు నుంచి మహేష్ జాయింట్ విన్నర్స్‌గా నిలిచారు. విజేతలు సీపీడీసీఎల్ చైర్మన్, ఎండీ బహుమతులు అందచేశారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీటీఏ జిల్లా అధ్యక్షుడు మణి సుబ్బు కోరారు. క్లస్టర్ పాఠశాలల్లో గురువారం నిర్వహించిన సభ్యత్వ నమోదులో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం ఉదాసీనంగా ఉందన్నారు. డీఏ బకాయిలు, ఐఆర్ ప్రకటన నేటికీ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నదన్నారు. యాప్‌ల భారం అధికమై బోధనేతర పనులతోనే సమయం గడిచిపోతోందని, వీటిని వెంటనే తప్పించి బోధనకు మాత్రమే పరిమితం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాస ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్, నేతలు పీ.రవి, ఏ.హరి, కే.చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వం నమోదులో పాల్గొన్న బీటీఏ నేతలు

త్వరలోనే అందుబాటులోకి స్మార్ట్ స్ట్రీట్ బజారు

నెల్లూరు(సిటీ),సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి) : నగరంలోని జాకీర్‌హుస్సేన్‌నగర్‌లో ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ బజారును త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎన్ఎంసీ కమిషనర్ నందన్ తెలిపారు. అక్కడ జరుగుతున్న పనులను ఆయన గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. పనులన్నీటిని వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం అదే ప్రాంతంలో మున్సిపల్ ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకు వద్ద నిర్మిస్తున్న ప్రహరీ పనులరు పరిశీలించారు. తడికల బజార్ వద్ద అన్నక్యాంటీన్ పక్కన నిర్మిస్తున్న పార్కు పనులనుతనిఖీ చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం పత్తేఖాన్‌పేట వద్ద రోడ్డు ఆక్రమణపై తనిఖీ చేసిన వాటిని తొలగించాలన్నారు.


తాగునీటి పైపులైన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ నందన్

ఇంతియాజ్ జన్మదిన వేడుకలు

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మదీనా వాచ్ గ్రూపు చైర్మన్ డాక్టర్ హాజీ లయన్ షేక్.ఇంతియాజ్ పుట్టినరోజును గురువారం గాంధీబొమ్మ సెంటర్‌లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. తొలుత నగరంలోని ట్రంకురోడ్డు వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇంతియాజ్‌తోపాటు ఆయన కుమారులు షేక్.షోయబ్, షేక్.ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంతియాజ్‌కి ప్రముఖులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


అన్నదానం చేస్తున్న ఇంతియాజ్, తదితరులు

సిల్వర్‌ఓక్స్‌కు స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డు

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సద్గురు సిల్వర్ ఓక్స్ స్కూలు ద స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డు దక్కించుకుంది. పాఠశాల నాణ్యతపై ర్యాంకింగ్ ఇచ్చే సెంటర్ ఫర్ స్కూల్ ర్యాం కింగ్స్, బ్రెయిన్ ఫీడ్ ఇండి యా సంస్థలు సంయుక్తంగా న్యూఢిల్లీలో గురువారం జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో పాఠశాల డైరెక్టర్‌లు షణ్ముకాచారి, వెంకటాద్రిలకు అవార్డును అందచేశారు. దీంతో మిగిలిన పాఠశాల డైరెక్టర్లు హర్షం వ్యక్తం చేశారు.



అవార్డు అందుకుంటున్న పాఠశాల డైరెక్టర్లు

ముత్తుకూరు అండర్ బ్రిడ్జి పనులు త్వరలో పూర్తి

నెల్లూరురూరల్,సెప్టెంబరు 11,(ఆంధ్రజ్యోతి) : నగరంలోని రామలింగాపురం వద్ద నిర్మాణంలో ఉన్న అండర్ బ్రిడ్జీ అతి త్వరలో ప్రజలకు అందుబాటులోకి వస్తుందని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. గురువారం అక్కడ జరుగుతున్న పనులను మాజీ మేయర్ భానుశ్రీతో కలిసి పరిశీలించారు. అండర్ బ్రిడ్జీ వద్ద సీసీరోడ్లు, బాక్స్ కల్వర్టు, సుందరీకరణ పనులు అతివేగంగా జరుగుతున్నాయన్నారు. అతిత్వరలోనే ఈ మార్గం ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌చార్జీలు వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, చక్రవర్ధన్‌రెడ్డి, క్లష్టర్ ఇన్‌చార్జి మదన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారానికి ఏచూరి కృషి

సీపీఎం నేతల నివాళి

నెల్లూరు (వైద్యం) సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి దివంగత సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి ఎంతో కృషి చేశారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తెలిపారు. గురువారం ఏచూరి వర్ధంతి సందర్భంగా నగరంలో నిర్వహించిన నివాళి కార్యక్రమంలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యసభ సభ్యుడిగా ఆయన చూపిన చొరవ మరువలేనిదని చెప్పారు. విద్యార్థి దశనుంచే అనేక పోరాటాలు చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు కట్టా సతీష్, నజీర్, నగేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

రోడ్డు మార్జిన్ వ్యాపారుల సభను జయప్రదం చేయాలి

నెల్లూరు (వైద్యం) సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు మార్జిన్ వ్యాపారుల జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని సీఐటీయూ నేతలు కరపత్రాలు పంపిణీ చేశారు. గురువారం నగరంలోని వేదాయపాళెం, కొండాయపాళెం గేట్, ఆర్టీసీ, డైకాస్‌రోడ్డు తదితర ప్రాంతాలలో వ్యాపారులను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రూరల్ అధ్యక్షుడు సుధాకర్ మాట్లాడుతూ ఈ నెల 14న సీపీఎం జిల్లా కార్యాలయంలో జిల్లా మహాసభ నిర్వహించనున్నామని, పెద్ద సంఖ్యలో వ్యాపారులు పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేతలు నరసింహారెడ్డి, ఖలీల్, లవకుమార్, ఖాజావలి, నజీర్ శాన్వాజ్, సిద్దయ్య, ఇగ్బాల్ తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు మార్జిన్ వ్యాపారులకు కరపత్రాలు పంచుతున్న సీఐటీయూ నేతలు



చెరువును తలపిస్తున్న ఇంద్రలోక్ అవెన్యూ ప్రాంతం

ఇంద్రలోక అవె'న్యూ'సెన్స్'!

ఇది చెరువు కాదు... ఏకంగా ఇంద్రుడిలోకం పేరుతో ఏర్పాటు చేసుకున్న కాలనీ. కోవూరు పంచాయతీ పరిధిలో బహుళ అంతస్తుల భవనాలతో కనిపించే 'ఇంద్రలోక అవెన్యూ'. ఈ కాలనీ మధ్యభాగంలో చెరువు తలపించే విధంగా గుంతలు ఏర్పాడ్డాయి. అడవిని తలపించేలా పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి. పంచాయతీ సిబ్బంది పట్టించుకోకపోవడంతో కాలనీ పరిస్థితి 'పేరు గొప్ప - ఊరు దిబ్బ ' అన్న చందంగా మారింది. ఇంద్రలోక అవెన్యూలో దోమలు విలయతాండవం చేస్తున్నాయి. చిన్నారులు చాలా మంది జులుబు, దగ్గు, జ్వరాలతో బాధపడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి పరిశుభ్రత చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

- కోవూరు (ఆంధ్రజ్యోతి)

సంగం బ్యారేజీ నుంచి నీటి విడుదల

● పెన్నాలోకి 3800 క్యూసెక్కుల నీరు

నంగం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సంగం బ్యారేజీ నుంచి పెన్నా నదికి గురువారం నీటిని విడుదల చేశారు. సోమశిల జలాశయం నుంచి ఈ బ్యారేజీకి 1600 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తోంది. దీంతోపాటు ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షం వల్ల వాగులు, వంకలు ప్రవహించడంతో బ్యారేజీకి 2200 క్యూసెక్కుల నీరు వస్తోంది. మొత్తం 3800 క్యూసెక్కుల నీరు వస్తుండటంతో బ్యారేజి వద్ద నీటిమట్టం 11.3 అడుగుల నుంచి 11.8 అడుగులకు పెరిగింది. ఈ నీటిని బెజవాడ పాపిరెడ్డి (కావలి) కాలువకు 740 క్యూసెక్కులు, కనుపూరు కాలువకు 250, నెల్లూరు చెరువు కాలువకు 50, నెల్లూరు తాగునీటి పథకానికి 40 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు. మిగిలిన నీటిని బ్యారేజి దిగువ పెన్నానదికి 2800 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఈ నీటివిడుదల ఇంకా పెరిగే అవకాశం ఉంది.

● ఎవరూ నదిలోకి వెళ్లొద్దు!

సంగం బ్యారేజీ నుంచి పెన్నానదికి (నెల్లూరు బ్యారేజీ) నీరు విడుదల చేస్తుండటంతో పెన్నా పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ప్రధానంగా సంగం మండలంలోని పల్లిపాళెం, కోలగట్ల, వీర్లగుడిపాడు, పడమటిపాళెం, మక్తాపురం, అన్నారెడ్డిపాళెం పల్లిపాళెం గ్రామస్థులు, పశువుల కాపరులు నదిలోకి పశువులను మేతకు తీసుకపోవద్దని తహసీల్దారు సోమ్లానాయక్, సంగం



సంగం బ్యారేజీలో నీరు

ఇరిగేషన్ సెక్షన్ ఏఈ వినయ్ కుమార్ తెలిపారు.

● సోమశిలలో 71.430 టీఎంసీల నిల్వ

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం 18,967 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగింది. దీంతో డ్యాంలో 71.430 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, దిగువ డెల్టాకు 1,850, ఉత్తర కాలువకు 400, కండలేరుకు 9,250 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

● అధికారుల సమావేశం

సోమశిలలో నీటిమట్టం 74 టీఎంసీలకు చేరుకున్నాక నీరు విడుదల చేసే అవకాశం ఉందని, తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అనంతసాగరం తహసీల్దారు జయవర్దన్ ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని పెన్నాతీర గ్రామాల ప్రజలు జాగ్రత్తలు తీసుకొనే విధంగా రెవెన్యూ సిబ్బందితో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు.


సూక్ష్మచిత్ర రత్నం

● కళాకారుడిగా రాణిస్తున్న తెలుగు పండిట్
● ఆకులపై వందల రూపాలు
● వ్యర్థాలతోనూ కళాఖండాలు
● ప్రముఖుల ప్రశంసలు.. పురస్కారాలు

ఆయనో తెలుగు మాస్టారు. కవి, కళాకారుడు, చిత్రకారుడు కూడా. ఓ పక్క పిల్లలకు తెలుగు పాఠాలు, పద్యాలు, వ్యాకరణం బోధిస్తూనే, మరోవైపు కళాకారు డిగా రాణిస్తున్నారు. ఆయనకు రావి ఆకు అంటే ఎంతో ఇష్టం. దానిపై ఎన్నో కళారూపాలను ఆవిష్కరించారు. ఒక్క రావి ఆకే కాదు.. చాక్‌పీస్‌లు, పెన్సిళ్లు, బల్బులు, అట్టముక్కలు, పండ్లు, తినే పదార్థాలు... పడేసే వ్యర్థాలు... ఇలా అన్నింటితో సూక్ష్మరూపాలు సృష్టిస్తారు. అంతటితో ఆగిపోకుండా తాను ప్రావీణ్యం సంపాదించిన కళను పాఠశాల విద్యార్థులకు నేర్పుతున్నారు. ప్రతి పండుగ, ప్రముఖుల జయంతి, వర్ధంతులకు 'కళా'త్మకంగా జరపడం వారి ప్రత్యేకత. ఆయనే మనుబోలు మండలం వీరంపల్లి ఉన్నత పాఠశాల తెలుగు పండిట్ సోమా పద్మారత్నం.



రావి ఆకులపై ఎన్ని సిత్రాలో..



మనుబోలు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): సూక్ష్మకళాకారుడు పద్మారత్న అసలు పేరు సోమా వెంకటరత్నం. తల్లిదండ్రులు సోమా శ్రీరాములు, కాంతమ్మ. స్వస్థలం ముత్తుకూరు మండలంలోని సుబ్బారెడ్డిపాళెం. ఎంఏ. బీఈడీ, తెలుగు పండిట్ చదివారు. భార్య పేరు పద్మారాణి. రత్నం కళా ప్రతిభను ఆమె ప్రోత్సహిస్తూ సూచనలు, సలహాలు ఇస్తుంటారు. దీంతో వెంకటరత్నం. తన కళానామాన్ని పద్మారత్నంగా మార్చుకున్నారు. ఆయన చదువుకునే రోజుల్లోనే డ్రాయింగ్ వేసేవాడు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు అయ్యాక అటు ఉత్తమ టీచరుగా, ఇటు సృజనాత్మక కళాకారుడిగా రాణిస్తున్నారు.



సత్కారం అందుకుంటున్న పద్మారత్నం (ఫైల్)

9 ఏళ్లు.. 1500 చిత్రాలు

2016లో వివిధ పత్రికల్లో ప్రచురించిన సూక్ష్మ కళాచిత్రాలను చూసిన పద్మారత్నం, వాటిపై ఆసక్తి పెంచుకున్నారు. తొలుత బాదం ఆకుపై టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రాన్ని గీశారు. దానిని ఓ పత్రికలో అచ్చువేయడంతో పలు వురు పద్మారత్నాన్ని అభినందించారు. ఆ తర్వాత ఎన్నో చిత్రాలు గీశారు. కళా రూపాలకు ప్రాణం పోశారు.

ఇప్పటివరకు 1500 చిత్రాలు గీసి, వందకుపైగా కవిత లు రాసి ప్రముఖుల ప్రశంసలు, సత్కారాలు, అవార్డులు అందుకున్నారు. 2017లో ఉత్తమ ఉపాధ్యాయుడిగా, 2018లో ఉత్తమ చిత్రకళాకారుడిగా, 2020లో సృజనాత్మక చిత్రకారుడిగా, 2021లో రచయతగా, తెలుగుబుక్ ఆఫ్ రికార్డు చిత్రకారుడిగా అవార్డులు అందుకున్నారు. రావి ఆకుపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రాన్ని గీసి ఆయనకు బహూకరించాలనేది తన ఆశ అని పద్మారత్నం తెలిపారు.

పర్యాటక అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

● జిల్లా పర్యాటక అధికారి ఉషశ్రీ

నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పర్యాటక అభివృద్ధికి వనరులున్నాయని, వాటిని అభివృద్ధి చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా పర్యాటక అధికారి ఉషశ్రీ కోరారు. గురువారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పర్యాటకాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లేందుకు ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం-2025 సందర్భంగా ఫొటోగ్రఫీ రీల్స్, వీడియోల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాలు, సాంస్కృతిక వారసత్వ కోటలు, జలపాతాలు, ఏకో-టూరిజం, స్థానిక వంటకాలు వంటి అంశాలను ప్రోత్సహిస్తూ విద్యార్థులు,



ఫొటోగ్రాఫర్లు, సృజనాత్మక ప్రతిభ కలిగినవారు ఈ పోటీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. వారు తీసే ఫొటోలు హై రిజల్యూషన్ కలిగి జిల్లాలో తీసినవి అయి ఉండాలన్నారు. జేపీజీ ఫార్మాట్‌లో అందించాలన్నారు. ఫొటోగ్రఫీ పోటీల్లో పాల్గొనేవారు ఈనెల20లోపు అందజేయాలని కోరారు. రీల్స్ వీడియోల పోటీలో పాల్గొనేవారు తమ రీల్స్‌ను 30 -90 సెకన్లు (ఇన్‌స్టాగ్రామ్), వీడియో వ్యవధి గరిష్ఠంగా 3నిమిషాలు ఉండేలా రూపొందించాలన్నారు. విజేతలకు ఈనెల 27న కలెక్టర్ బహుమతులు అందజేస్తారన్నారు. ఫొటోలు, వీడియోలు, రీల్స్‌ను ఈనెల 20సాయంత్రం ఐదు గంటల్లోగా జిల్లా పర్యాటక శాఖాధికారి కార్యాలయం, 2వ అంతస్తు, బోట్ షికారు క్యాంపస్, బారాషహీద్ దర్గా దగ్గర, దర్గామిట్ట, నెల్లూరులో అందించాలని ఆమె తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు తమ వివరాలను 94936 68022, 7780749802 నంబర్లలో నమోదు చేయించుకోవాలన్నారు.

రేపు జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కబడ్డీ అసోసియేషన్ ఆఫ్ నెల్లూరు జిల్లా ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లా జట్ల ఎంపికలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు హరీష్ ఒక ప్రకటనలో తెలిపారు. బాలుర విభాగంలో 75 కేజీలు, బాలికల విభాగంలో 65 కేజీల విభాగంలో జరిగే ఈ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 1-1-2006 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఎంపికైనవారు విజయవాడలోని గొల్లపూడిలో ఈనెల 22 నుంచి 25 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తి కలిగిన వారు శనివారం సాయంత్రం 3 గంటలకు స్టేడియంలో హాజరు కావాలని తెలిపారు.

అమరవీరులు మనందరికీ స్ఫూర్తి : డీఎఫ్‌వో

నెల్లూరు(వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో ప్రాణాలు అర్పించిన అటవీ అమరవీరులు మనందరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా అటవీశాఖ అధికారి మహబూబ్‌బాషా పేర్కొన్నారు. జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా గురువారం నగరంలోని అటవీశాఖ కార్యాలయంలోని అమరవీరుల స్థూపానికి ఆయన నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ అటవీ సంపదను రక్షించడంలో ప్రాణాలను కోల్పోయిన వారి జీవితాలు అందరికీ ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రేంజర్ మాల్యాద్రి, కార్యాలయ అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అటవీ అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న డీఎఫ్‌వో మహబూబ్‌బాషా,ఉద్యోగులు

సీజనల్ హాస్టళ్లకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సమగ్రశిక్ష పరిధిలో నిర్వహిస్తున్న సీజనల్ హాస్టళ్ల నిర్వహణకు ఎన్‌జీవోలు, ఎస్‌హెచ్‌జీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీసీ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 15 సాయంత్రం 5 గంటలలోపు సమగ్రశిక్ష కార్యాలయంలో ఏపీసీకి దరఖాస్తులు అందచేయాలన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఎస్‌జీఎఫ్ కార్యదర్శుల నియామకం

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నిర్వహించే పాఠశాలల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) కార్యదర్శులను నియమిస్తూ పాఠశాల విద్య డైరెక్టర్ విజయ్‌రామరాజు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో అండర్-17, అండర్-19 విభాగాలకు మాత్రమే కార్యదర్శులను నియమిస్తూ రెండేళ్ల కాలపరిమితితో నియామకాలు చేపట్టేవారు. ఈ ఏడాది మాత్రం సంవత్సరం కాలపరిమితితో అండర్-14, 17, 19 విభాగాలకు ముగ్గురు కార్యదర్శులను నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. అండర్-14 ,17 విభాగాలకు సంగం జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన పీఈటీ బీ వెంకటరామయ్యను నిర్వాహక కార్యదర్శిగా, పొదలకూరు డీఎన్‌ఆర్ జడ్పీబాలికోన్నత పాఠశాల పీఈటీ ఎం దేవికను అడ్మిన్ కార్యదర్శిగా నియమించారు. అండర్-19 విభాగానికి కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల పీడీ పీ.వేణుగోపాల్‌రెడ్డిని నియమించారు. అండర్-14, 17 విభాగాలను డీఈవో, అండర్-19 విభాగాన్ని డీవీఈవోలు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్పోర్ట్స్ క్యాలెండర్‌ను అనుసరించి జిల్లాలో క్రీడల ఎంపికలు, నిర్వహణ నిబద్ధతతో చేపట్టాలన్నారు. అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు, పీఈటీలు, పీడీలతో సమన్వయం చేసుకుంటూ ఎంపికలు చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు పూర్తి వివరాలను లీప్ యాప్, ఎస్‌జీఎఫ్ఐ పోర్టల్ ద్వారా నమోదు చేయాలన్నారు. అన్నీ రికార్డులు పక్కాగా నమోదు చేస్తూ ప్రతినెలా ఐదున తమకు అందచేయాలన్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు, ఆరోపణలు లేకుండా ఎస్‌జీఎఫ్ నడుచుకోవాలని, ఫిర్యాదులు, ఆరోపణలు వస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఆ ఉత్తర్వుల్లో హెచ్చరించారు.

కండలేరు కాలువ పటిష్టతకు చర్యలు



కండలేరు కాలువ మట్టికట్టకు కార్మికులతో ఇసుక బస్తాలు వేయిస్తున్న అధికారులు

కలువాయి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సోమశిల కండలేరు వరద కాలువ పటిష్ఠతకు అధికారులు చర్యలు చేపట్టారు. (ఎస్‌కేఎఫ్ఎఫ్) 12కి.మీ ఉయ్యాలపల్లి సమీపంలో మట్టికట్టకు గత రెండు రోజులుగా ఇసుక బస్తాలు వేసి దెబ్బ తినకుండా పనులు చేస్తున్నారు. ఈప్రాంతంలో కండలేరు కాలువను విస్తరించి దానిపై జాతీయ రహదారి 565 కోసం వంతెన నిర్మించారు. దీంతో అప్పట్లో తాత్కాలికంగా పాత కాలువ, కొత్త వంతెన దగ్గర విస్తరించిన కాలువకు మధ్య మట్టికట్ట నిర్మించారు. అయితే ప్రస్తుతం కండలేరు కాలువకు 9వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. దీంతో కాలువలో నీటి ప్రవాహం ఈ మట్టికట్టను తాకుతుండంతో మట్టికట్ట దెబ్బతింటోంది. దీంతో ఇటీవల కాలువను పరిశీలించిన తెలుగుగంగ ఉన్నతాధికారులు ఇక్కడ ఇసుక బస్తాలు నింపి కాలువకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో అధికారులు రెండు రోజులుగా ఇసుక బస్తాలతో నింపే పనులు చేపట్టారు. ఈ పనులు పూర్తయిన తరువాత కాలువకు నీటి విడుదలను 9వేల క్యూసెక్కుల నుంచి 10వేలకు పెంచుతామని అధికారులు తెలిపారు.

2003 - డీఎస్సీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు మెమో 57 అమలు చేసి న్యాయం చేయాలని ఫ్యాప్టో నేతలు డిమాండ్ చేశారు. నగరంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్‌లు మాస ప్రసాద్, జీ.భాస్కర్ మాట్లాడుతూ 2003 నవంబర్‌లో నోటిఫికేషన్ విడుదలై, 2004 సెప్టెంబర్ 1 తరువాత నియమితులై సీపీఎస్ విధానంలోకి బలవంతంగా నెట్టబడ్డారన్నారు. ఈ విషయమై కేంద్రం సవరించిన మెమో 57ను అమలు చేసి రాష్ట్రంలోని 11వేల మందికి పైగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో 2003 ఉపాధ్యాయులు ఫోరమ్ నాయకులు చంద్రశేఖర్, శ్రీకాంత్, వెంగయ్య, ఇందిర, ఫ్యాప్టో నేతలు చలపతిశర్మ, హజరత్, దశరథరాములు, పిచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.




నిరసన తెలుపుతున్న ఫ్యాప్టో నాయకులు

మనసు మార్చుకుని చంద్రబాబు కాళ్లు పట్టుకో!

● జగన్‌కు నుడా చైర్మన్ కోటంరెడ్డి హితవు

నెల్లూరు (వైద్యం) సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వీధి రౌడీలా మాట్లాడుతున్నారని, ఆయన తన మనసు మార్చుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కాళ్లు పట్టుకోమని లేదంటే చరిత్ర హీనుడిగా మారిపోతావని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసుల రెడ్డి హితవు పలికారు. గురువారం టీడీపీ జిల్లా కార్యాలయంలో కోటంరెడ్డి విలేకరులతో మాట్లాడారు. పీపీపీ పద్ధతిలో వైద్య కళాశాలలకు ప్రభుత్వం అనుమతులు ఇస్తే తాను అధికారంలోకి వస్తే వాటిని రద్దు చేస్తామని జగన్ మాట్లాడటం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. పవన్, చంద్రబాబు బావిలో దూకాలంటూ జగన్ చేసిన వాఖ్యలపై మండిపడ్డారు. జగన్ చేసిన పాపాలకు వందల బావుల్లో దూకాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కడప జిల్లా బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడిగా గతంలో జగన్ పనిచేశాడని ఈ నేపథ్యంలో వైసీపీని మూసేసి టీడీపీలో చేరాలని హితవు పలికారు.



వైసీపీ నేతలంతా జైలులో ఉన్నారని త్వరలో వైసీపీని మూసేసి ఆయన కూడా జైలుకు వెళ్లటం ఖాయమన్నారు. సూపర్ సిక్స్‌లో లేని హామీలు కూడా కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని అన్నారు. అంగన్వాడీలకు కూడా ప్రభుత్వం ఎంతో లబ్ది చేకూర్చిందన్నారు. సూపర్ సిక్స్ సూపర్‌హిట్ మహాసభకు లక్షలాది మంది జనం తరలి వస్తే అసలు జనమే లేరంటూ కళ్లు లేని కబోదిలా జగన్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ పూర్తిగా రౌడీల పార్టీ అని తాను టీడీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్నప్పుడు తనను చంపాలని వైసీపీ గుండాలు చూశారని దుయ్యబట్టారు.

సూపర్ సిక్స్.. సూపర్ సక్సెస్!

● ప్రజాదరణ ఓర్వలేకనే జగన్, కాకాణి విమర్శలు : సోమిరెడ్డి

నెల్లూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : 'వైసీపీ ప్రభుత్వం అవినీతి, అరాచకాలకు పరిమితమైతే మా కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి చిరునామాగా నిలుస్తోంది. అనంతపురంలో నిర్వహించిన సూపర్ సిక్స్- సూపర్ హిట్ కార్యక్రమం సూపర్ సక్సెస్ కావడంతో వైసీపీ నేతలు ఓర్చులేకపోతున్నారు. ప్రభుత్వానికి వస్తున్న ప్రజాధరణను చూసి ఓర్వలేక వైసీపీ రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు' అంటూ టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. గురువారం నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిత్యం తనను, తమ పార్టీ నాయకులను తిట్టనిదే కాకాణికి తిన్నది అరగడం లేదని సోమిరెడ్డి ఎద్దేవా చేశారు. తాను ఫ్యాన్ వేస్తే ఎగిరిపోతానేమోగానీ కాకాణిలా మాత్రం ఊళ్లో వాళ్ల ఆస్తులు తిని అడ్డంగా బలవలేదని విరుచుకుపడ్డారు. సాగరమాల హైవేకు గ్రావెల్‌ను తోలుకుంటుంటే అదేదో తాము దోచుకుంటున్నట్లు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సాగరమాల పనులు చేస్తున్న ఏఎంఆర్, వీడీబీ సంస్థలు ఇప్పటి వరకూ గ్రావెల్ సీనరైజ్ కింద రూ.2.56 కోట్లు ప్రభుత్వానికి చెల్లించాయని ఆధారాలతో సహా సోమిరెడ్డి వెల్లడించారు. సాగరమాల పనులు చేస్తున్న మేకపాటి అభిషేక్‌రెడ్డికి ఫోన్ చేసి అడిగితే కాకాణికి వాస్తవాలు తెలుస్తాయని హితవుపలికారు. వైసీపీ ప్రభుత్వంలో సర్వేపల్లిలో ఏవిధంగా గ్రావెల్ తవ్వకాలు జరిపి ప్రజాధనాన్ని కొల్లగొట్టారో అందరికీ తెలుసన్నారు. ఎస్ఈజెడ్‌లో సిలికా మైనింగ్ అంటూ ఇష్టమొచ్చినట్లు మాట్లాడారని, ఆ ఎస్ఈజెడ్ అనేది తమకు చెందిన సీవీ రావుదని గుర్తు చేశారు. పచ్చి అబద్ధాలతో అధికారులను బెదిరించేలా కాకాణి మాట్లాడటం సిగ్గు చేటన్నారు. ఒక ప్రజాప్రతినిధిగా ఉండి 2016లో నకలి డాక్యుమెంట్ల కేసు సమయంలో 60 రోజులు కనిపించకుండా పోయారని, రుస్తుం మైన్స్ కేసులో 57 రోజులు అరణ్యవాసం గడిపి, ఆ తర్వాత జైలులో 87 రోజులు అజ్ఞాత వాసం గడిపారని ఎద్దేవా చేశారు. 204 రోజులు కనిపించకుండా పోయిన కాకాణికి మరో పీహెచ్‌డీ ఇవ్వాలని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.



బిట్రగుంటలో పలు రైళ్లకు స్టాపింగ్

బిట్రగుంట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వేస్టేషన్‌లో పలు రైళ్లకు అధికారికంగా స్టాపింగ్ ఇస్తూ రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి-కాకినాడ టౌన్ మధ్య నడిచే రైలు (17249) తెల్లవారుజాము 1.50 గంటలకు బిట్రగుంటకు వస్తుంది. కాకినాడ నుంచి తిరుపతి వెళ్లే రైలు (17250) రాత్రి 11 గంటలకు వస్తుంది. చెన్నైసెంట్రల్ నుంచి శ్రీవైష్ణవి దేవీమాత కాట్రా అండమాన్ ఎక్స్‌ప్రెస్ (16031) ఉదయం 8.15 గంటలకు వస్తుంది. ఈ రైలు బుధ గురు, ఆదివారాల్లో ఉంటుంది. శ్రీవైష్ణవిదేవిమాత కాట్రా నుంచి చెన్నై (16032) తెల్లవారుజాము 2.13 గంటలకు వస్తుండగా, సోమ, మంగళ, శుక్రవారాల్లో నడుస్తుంది. చెన్నైసెంట్రల్ నుంచి లఖ్‌నవ్ వెళ్లే (16093) ఉదయం 8.15 గంటలకు మంగళ, శనివారాల్లో ఉంటుంది. లఖ్‌నవ్ నుంచి చెన్నై సెంట్రల్ వెళ్లే (16094) తెల్లవారుజాము 2.13 గంటలకు ఉంటుందని రైల్వే అధికారులు తెలిపారు.

మందుల కొరత రాకుండా చూసుకోవాలి

సీతారామపురం, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి) :వైద్యానికి అవసరమైన మందుల కొరత రాకుండా చూసుకోవాలని వెటర్నరీ డాక్టర్ రాఘవేంద్రశర్మ సూచించారు. మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామ పంచాయతీలోని రైతు సేవా కేంద్రాన్ని వెటర్నరీ డాక్టర్ రాఘవేంద్రశర్మ తనిఖీ చేశారు. పశువులకు అందిస్తున్న వైద్య సేవలు, మందుల రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 10434
వెండి కిలో ధర	రూ. 128900
వెండి ఒక గ్రాము	రూ. 131.90

న్యూస్ బాక్స్

గంధ మహోత్సవ గోడపత్రిక ఆవిష్కరణ



గోడపత్రికను చూపుతున్న మంత్రి ఆనం

అనంతసాగరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక మష్కూర్ అలీషాఖాదరీ దర్గా గంధమహోత్సవ గోడపత్రికను నెల్లూరులో గురువారం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేతుల మీదుగా దర్గా నిర్వాహకులు ఆవిష్కరించారు. ఉరుసుకు రావాలని మంత్రి ఆనంను ఆహ్వానించారు. అలాగే సోమశిల ప్రాజెక్టు చైర్మన్ వేలూరు కేశవచౌదరిని కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మెట్టుకూరు కృష్ణారెడ్డి, దర్గా నిర్వాహకులు సానీ, మజీద్ సాహెబ్, మీరాన్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

ఉదయగిరి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్వయం సహాయక సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఏపీఎం శారా స్రవంతి కోరారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ సీసీలు గ్రామాల్లో తిరిగి రుణాల రికవరీ శాతాన్ని పెంచాలన్నారు. సభ్యులు నెలసరి సమావేశాలు నిర్వహించాలన్నారు. సంఘాలు పటిష్ఠంగా పనిచేసి ప్రతి పొదుపు సంఘంలోని ప్రతి మహిళ ఆర్థిక పరిపుష్టి సాధించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు, వీవోఏలు, సంఘబంధాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతులు పాటించాలి

ఉదయగిరి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ సూచించారు. గురువారం మండలంలోని మండలంలోని ఆర్లపడియ గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువులు అధికంగా వాడడం వల్ల అనేక అనర్థాలు చోటుచేసుకుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

వింజమూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటుకూరు పంచాయతీ పరిధిలోని ఇందిరానగర్ గ్రామంలో తలపల ప్రసాద్‌కి చెందిన పూరిల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా గురువారం దగ్ధమైంది. పూరి గుడిసెకు మంటలు వ్యాపించడంతో ఇంట్లో వస్తువులు, కొంత నగదు కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు.

విద్యార్థులకు బహుమతులు

మర్రిపాడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చుంచులూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు జ్ఞాపకార్థం ఆయన భార్య రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల స్థానిక పాఠశాల విద్యార్థులకు గురువారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. గత ఏడాది పదవ తరగతి ఫలితాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు, అలాగే 6వ తరగతి నుంచి పది వరకు ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక హెచ్ఎం విజయ్‌భాస్కర్, రిటైర్డ్ ఎంఈవో సత్యనారాయణ, రమణయ్య, రాజేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సుల ఫిర్యాదులపై విచారణ


ఏఎస్‌పేట,సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): తమను వేధిస్తున్నారని స్థానిక పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సులుగా పనిచేస్తున్న కే లత, తోట లక్ష్మిలు గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు అందించడంతో గురువారం డిప్యూటి డిఎంహెచ్‌ఓ పి బ్రిజిత విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె వైద్యులను, సిబ్బందిని విచారించారు. నివేదికలను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు గోపీనాథ్, సురేష్‌బాబు, మంజుల, లక్ష్మీ నరసింహ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల తనిఖీ

సీతారామపురం, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి) :మండల కేంద్రంలోని కోటవీధిలోని ప్రాథమిక పాఠశాలలను గురువారం తనిఖీచేసి విద్యార్థుల మూల్యాంకన పుస్తకాలను పరిశీలించారు. తెలుగు గుణింతాలు సులభంగా పిల్లలకు ఎలా నేర్పించాలో వివరించారు. మధ్యాహ్న భోజనం రుచిచూసి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామకృష్ణంరాజు, ఉపాధ్యా యులు వెంకటేశ్వర్లు,రవి, షేక్ తుల్లా, షేక్ తాబుసం, సీఆర్‌పీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉదయగిరికి పర్యాటక సొబగు!

● దుర్గం మెట్ల మార్గం వరకు రూ.కోటితో సిమెంట్‌రోడ్డు ● ప్రారంభానికి సిద్ధమైన పర్యాటక భవనాలు



ఉదయగిరి దుర్గం



ప్రారంభానికి సిద్ధమైన పర్యాటక శాఖ భవనాలు

ఉదయగిరి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఘన చరిత్ర కలిగిన ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఉదయగిరి నుంచి దుర్గంపల్లికి వెళ్లే ప్రధాన రహదారి నుంచి దుర్గం మెట్ల మార్గం వరకు రూ.కోటితో సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. రోడ్డును నిర్మించేందుకు ఇటీవల రెవెన్యూ, అటవీ, అర్కియాలజీ, సర్వే శాఖల అధికారుల బృందం సంయుక్తంగా పరిశీలించింది. వారి నివేదికల ప్రకారం అనుమతులు రాగానే రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ఈ రోడ్డు పూర్తయితే దుర్గంపైకి రాకపోకలకు పర్యాటకులకు ఎంతో అనువుగా ఉంటుంది.

● 2010లో ఆనకట్ట సమీపంలో సుమారు రూ.10 లక్ష లతో పర్యాటక శాఖ అతిథిగృహం, హోటల్ నిర్వహణకు భవనాలు నిర్మించింది. ఇప్పటికీ ఆ భవనాలు ప్రారం భానికి నోచుకోక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో పర్యాటక శాఖ అధికారులు ఆ భవనాలను అద్దె ప్రాతిపదికన ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చేందుకు ప్రకటన ఇవ్వడంతో ఓ వ్యక్తి దక్కించుకున్నాడు.

● గ్రామకొలను పథకంలో భాగంగా రాయలనాటి ఉదయగిరి చెరువు ఆనకట్ట సుందరీకరణకు రూ.15 కోట్లు మంజూరయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వం నిధులు మంజూరులో జాప్యం చేయడంతో కొంతమేర పనులు జరిగి నిలిచిపోయాయి. అనంతరం నిధులను రూ.9 కోట్లకు తగ్గించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దానిపై దృష్టి సారించి, పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తవగా, మిగిలిన 20 శాతం పనులు పూర్తయితే పట్టణానికి ప్రత్యేక శోభ సంతరించుకుంటోంది.

● ఉదయగిరి చారిత్రక దుర్గానికి గౌరవ చిహ్నంగా ఐఎన్ఎస్ ఉదయగిరి పేరుతో వికసిత భారత్‌లో భాగంగా స్వీయ సాంకేతికతతో తయారు చేసిన యుద్ధ నౌకను విశాఖలో గతనెల 26న కేంద్ర మంత్రి రాజనాథ్ సింగ్ జాతికి అంకితం చేశారు. ఉదయగిరి దుర్గం అడవుల్లో సంచరించే వన్యప్రాణి లోగో యుద్ధనౌకపై చిత్రించారు. ప్రతిపాదనలకే పరిమితమైన ఉదయగిరి దుర్గాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికమొత్తంలో నిధులు మంజూరుచేసి పూర్తిస్థాయిలో పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధికి రూ.50 కోట్లతో ప్రతిపాదనలు

● కాకర్ల సురేష్, ఎమ్మెల్యే, ఉదయగిరి



ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వానికి రూ.50 కోట్లతో ప్రతిపాదనలు పంపడం జరిగింది. ఇప్పటికే దుర్గంపల్లి ప్రధాన రహదారి నుంచి మెట్లమార్గం వరకు రూ.కోటితో సిమెంట్‌రోడ్డు మంజూరు చేయించాం. అలాగే ఉదయగిరి ఆనకట్టను రూ.9 కోట్లతో సుందరీకరిస్తున్నాం. నిరుపయోగంగా ఉన్న పర్యాటక భవనాలను వాడుకలోకి తీసుకొస్తున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే దుర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తాం.

400 గోకులం షెడ్ల మంజూరు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ మృధుల

ఉదయగిరి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 400 గోకులం షెడ్‌లు మంజూరైనట్లు ఏపీడీ మృధుల పేర్కొన్నారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు గోకులం షెడ్‌లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పశుసంవర్థక శాఖ సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలన చేసి అర్హులైన రైతుల జాబితాను అందజేస్తారన్నారు. అనంతరం ఉన్నతాధికారులకు నివేదించి పరిపాలన ఆమోదం వచ్చిన వెంటనే నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఉదయగిరి మండలానికి 62 గోకులం షెడ్‌లు మంజూరు కాగా నిర్మాణాలు పూర్తయి రైతులకు బిల్లులు చెల్లించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అప్పాజీ, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు కాలువను మూసివేయాలి

● తహసీల్దార్‌కి గ్రామస్థుల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీ కాలనీ వాసులు

సీతారామపురం, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): గత సంవత్సరం నుంచి కల్వర్టు కాలువను మూసివేయకుండా 167బి జాతీయ రహదారి కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండల పరిధిలోని బోడసిద్దాయపల్లి గ్రామానికి చెందిన ఎస్టీ కాలనీ వాసులు తహసీల్దార్ ఫజీహాకు గురువారం ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 167బి అతీయ రహదారి కాంట్రాక్టర్లు మా కాలనీ వద్ద కల్వర్టు తో పాటు కాలువ నిర్మించి మూసివేయకుండా వదిలేశారని,దాంతో అక్కడ చెత్తాచెదారం చేరి మురుగునీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోందని, చిన్న పిల్లలు కాలువలో పడి గాయపడిన సంఘటనలు ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. సమస్య పరిష్కరించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు.

ఉదయగిరి పంచాయతీలో ఆడిట్



ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

ఉదయగిరి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉదయగిరి గ్రామ పంచాయతీలో చేపట్టిన జమ, ఖర్చుల నిర్వహణపై సోమవారం జిల్లా ఆడిట్ అధికారులు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఆడి టర్ మనూజ, సీనియర్ ఆడిట్ అధికారి కోటేశ్వరరావులు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. పంచాయతీ ఆర్థిక సంఘ నిధులకు సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించి ఆడిట్ నిర్వహించడం జరిగిందన్నారు. ఆడిట్ నివేదికను ఉన్నతాధికారులకు అందజేయడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కరీముల్లా, జూనియర్ ఆడిట్ అధికారి సాయికుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సాయిప్రసాదు

సీతారామపురం, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి) : స్వామిత్వ సర్వేపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, సర్వేయర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎక్కువ శాతం గ్రామాల్లో ఇప్పటికీ తమ నివాసాలకు ఆస్తి పత్రాలు లేక, కొలతలు తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను చక్కదిద్దేందుకు స్వామిత్వ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టింది. కావున ప్రతి ఒక్కరు బృందంగా వెళ్లి సర్వే చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు రాంనాథరెడ్డి, పిడుగు రవీంద్ర , నాగేంద్ర ,డిప్యూటీ ఎంపీడీవో , మండల సర్వేయర్ శ్రీకాంత్, పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటల ఉత్పత్తి



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఆత్మకూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వారానే ఆరోగ్యకరమైన పంటల ఉత్పత్తి సాధ్యమని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన ఆత్మకూరు మండలంలోని నాగులపాడు గ్రామం రైతు సేవా కేంద్రం పరిధిలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించి అనంతరం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం రైతులకు పిఎం డిఎస్ విత్తనాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి సిద్ధంగా లభించే వనరులను వినియోగించుకోవడం ద్వారా కూరగాయలు, పండ్ల మొక్కలు, ఆకు కూరలు, వరి మొదలైన పంటలు ఆరోగ్యక రంగా పెరుగుతాయని, మట్టిసారం నిలకడగా ఉంటుందన్నారు. రసాయనాలు అధిక మోతా దులో వాడటం వల్ల ప్రకృతి కలుషితంతో పాటు భూసారం తగ్గి, ప్రజల ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని వివరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ అధికారి కే కిషోర్‌బాబు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ వి ప్రత్యూష, మాస్టర్ ట్రైనర్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల కుటుంబాలకు అండగా ఉంటాం



గాయపడ్డ చిన్నారిని పరామర్శిస్తున్న టీడీపీ నేతలు

ఉదయగిరి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పసముద్రం గ్రామంలో వినాయక విగ్రహ నిమజ్జనోత్సవం సందర్భంగా ప్రమాదవశాత్తు బాణసంచా పేలి తీవ్రంగా గాయపడ్డ చిన్నారుల కుటుంబాలకు అండగా ఉంటామని నియోజకవర్గ టీడీపీ నాయకులు పేర్కొన్నారు. గురువారం వారు గ్రామానికి చేరుకుని వైద్యశాల నుంచి ఇంటికి వచ్చిన చిన్నారులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వైద్యశాలకు చేరుకుని చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారన్నారు. అలాగే వారి పరిస్థితిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి సైతం తీసుకెళ్లి ఒక్కో చిన్నారికి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయించడం హర్షణీయమన్నారు. అలాగే తీవ్రంగా గాయపడిన చిన్నారులకు ప్లాస్టిక్ సర్జరీ చేయించేందుకు కూడా చర్యలు చేపట్టారన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, టీడీపీ నాయకులు శ్రీకుర్తి రవీంద్రబాబు, బొజ్జా నరసింహులు, చల్లా వెంకటేశ్వర్లు, బొజ్జా శ్రీనివాసులు, చీమల తాతయ్య, నల్లిపోగు నరసింహా, ఉప్పుటూరి పెదవెంకటయ్య, పాముల సుబ్బరాయుడు, శివకృష్ణ, బత్తల నరసింహులు, యానాదయ్య, హరీష్, జల్సా, స్థానికులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



డిప్యూటీ ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఉదయగిరి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని మండలంలోని సచివాలయ ఉద్యోగులు గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవో షేక్ కరీముల్లాకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ ఇంటింటికి తిరిగి నిర్వహించే సర్వేలు, ఇతర పనుల నుంచి తమకు విముక్తి కలిగించాలన్నారు. సచివాలయ ఉద్యోగులను మాతృశాఖకు అప్పగించాలన్నారు. సమయపాలన లేని, వత్తిడితో కూడిన విధుల నుంచి ఉపశమనం కల్పించాలన్నారు. ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్‌లు మంజూరు చేయాలని, ఆరేళ్లుగా ఒకే క్యాడర్‌లో పని చేసిన వారికి ప్రత్యేక ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పక్షం రోజుల్లో పరిష్కరించకపోతే దశల వారీగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై రాత్రిపూట గ్రామాల్లో తిరగండి

ఆత్మకూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగ దారులకు మెరుగైన సేవలు అంది ంచేందుకు ఉద్యోగులు రాత్రివేళల్లో గ్రామాల్లో తిరిగి సమస్యలు తెలు సుకోవాలని విద్యుత్‌శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీరు వి విజయన్ సిబ్బందికి సూచించారు. గురువారం ఆయన ఆత్మకూరులో జరిగిన డివిజన్ సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ జిల్లా స్థాయిలో మెరుగైన సేవలు అందించిన అధికారులను తాను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని తెలిపారు. వారంలో ఒకరోజు రాత్రి వేళల్లో గ్రామాలలో సందర్శించి విద్యుత్ సమస్యలపై గ్రామస్థులను అడిగి తెలుసుకుని పరిష్కరించాలన్నారు. డివిజన్‌లో ఉత్తమ సేవలు అందించిన పలువురు సిబ్బందిని అభినందించి సత్కరించారు. అనంతరం సిబ్బందికి వృత్తిలో ఉపయోగపడే పని ముట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ భానునాయక్, డిప్యూటీ ఇంజనీర్ చిన్న స్వామి నాయక్, కలిగిరి ఏడీఈ కృష్ణమోహన్, కార్యాలయ ఏవో సుబ్బారావు, డివిజన్‌లోని అన్ని మండలాలకు చెందిన ఏఈలు, ఎల్ఐలు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు 720 బేళ్లను తీసుకొని రాగా 18 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 436 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 284 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 327 కాగా, కనిష్ఠ ధర రూ.110 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

C.R.I.M.E N.E.W.S

విద్యుదాఘాతానికి గురై నలుగురు కూలీలకు తీవ్ర గాయాలు

జలదంకి, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మలపాలెంలోని కెవిఆర్ కన్వెన్షన్ వద్ద గురువారం విద్యుదాఘాతానికి గురై నలుగురు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. కన్వెన్షన్ ఆర్చి మరమ్మతు పనులు చేస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. కూలీలు ట్రాలీ నిచ్చెనను పక్కకు జరుపుతుండగా అక్కడే ఉన్న 11 కెవి విద్యుత్ వైర్లను ట్రాలీ తగలడంతో నలుగురు కూలీలు విద్యుదాఘాతానికి గురై గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం కన్వెన్షన్ సెంటర్ సూపర్‌వైజర్ కావలి ఏరియా వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

● కందుకూరులో యువకుడి మృతి



మృతిచెందిన వెంకటచైతన్య

కందుకూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుడం గుంటకాలనీకి చెందిన తలపల వెంకట చైతన్య (23) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కార్పెంటర్ సహాయకునిగా పనిచేస్తున్న ఈ యువకుడు పట్టణంలోని పడమర వడ్డె పాలెంలో నూతనంగా నిర్మి స్తున్న ఓ ఇంట్లో ఉడ్ ఎలక్ట్రిక్ డ్రిల్లింగ్ మిషన్‌తో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాకుతో బుధ వారం రాత్రి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు తమకు న్యాయం చేయాలని గురువారం ఆందోళన చేపట్టారు. పట్టణ ఎస్ఐ శివనాగ రాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదంగా యువతి...



మృతిచెందిన సనా

దుత్తలూరు (ఉదయగిరి), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటంపేట గ్రామ బీసీ కాలనీకి చెందిన పఠాన్ సనా (17) అనే యువతి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకొంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పఠాన్ ఖాదర్‌బాషా, నాజున్నీసాల పెద్ద కుమార్తె సనా దుత్తలూరు ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం వరకు చదివి ఇంట్లోనే ఉంటోంది. అనారోగ్యంగా ఉండడంతో గురువారం భార్యాభర్తలు ఉద యగిరి వైద్యశాలకు వెళ్లారు. అనంతరం తిరిగి ఇంటికెళ్లి చూడగా కుమార్తె సనా కిందపడి అపస్మారక స్థితిలో ఉండడంతో హుటా హుటిన ఓ ఆటోలో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారిం చారు. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆదిలక్ష్మి తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన చల్లా రాము

సంగం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కలిగిరి రహదారికి సమీపంలో అటవీ ప్రాంతంలో గురువారం ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్లిన పశువుల కాపరులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో వెళ్లి పరిశీలించారు. మృతుడు స్థానిక రాళ్లచెలిక ప్రాంతానికి చెందిన ఆటోడ్రైవర్ చల్లా రాము (42)గా పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యు లకు సమాచారం అందించారు. కుటుంబంలో ఎటువంటి సమస్యలు లేవని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. పోస్టుమార్టం నిమి త్తం రాము మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తర లించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెండు మోటార్ బైక్‌ల ఢీ

● ఒకరు మృతి.. మరొకరికి గాయాలు



సాయిసూర్య మృతదేహం

కావలి రూరల్, సెప్టెంబరు 11: ముందు వెళ్తున్న మోటారు బైక్‌ను వెనుక వస్తున్న మరో మోటారు బైక్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరికి గా యాలైన సంఘటన ముసు నూరు జాతీయ రహదారిపై గురువారం జరిగింది. స్థానికులు, బాధితుల వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా శింగరాయకొండ గోపాల్‌నగర్‌కు చెందిన రొండా సాయి సూర్య (27) లిక్కర్ ఫ్యాక్టరీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం సాయిసూర్య బుచ్చి మండలం ఎల్లాయపాలెంలో బంధువుల కర్మక్రియల్లో పాల్గొని అనంతరం మోటారుబైక్‌పై శింగరాయకొండకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని ముసునూరు జాతీయ రహదారి బ్లూమూన్ డాబా సమీపంలోకి వచ్చేసరికి గౌరవరానికి చెందిన ఉప్పు నాగరాజు మోటారుబైక్‌పై గౌరవరం నుంచి కావలికి వస్తుండగా బైక్ వెనుక వైపున సాయిసూర్య మోటారుబైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగరాజుకు స్వల్ప గాయాలు కాగా సాయిసూర్య అక్కడికక్కడే మృతిచెందాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మట్టి తరలిస్తున్న వాహనాల సీజ్



స్టేషన్ ఆవరణలో ఉన్న మట్టి ట్రాక్టర్లు

కావలి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కావలి రూరల్ మండలం ఆముదాలదిన్నె చెరువులో అక్రమంగా మట్టిని తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు, ఒక ఎక్సకావేటర్‌ను గురువారం మధ్యాహ్నం విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. ఒంగోలు విజిలెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ రామచంద్ర ఆదేశాల మేరకు విజిలెన్స్ టెక్నికల్ అసిస్టెంట్‌లు తిరుపతి రావు, హరిబాబులు సాధారణ తనిఖీలు చేపట్టారు. మట్టి తరలిస్తున్న వాహనాలను సీజ్‌చేసి కావలి రూరల్ పోలీసులకు అప్పగించారు.

బీరు బాటిల్‌తో దాడి

కావలి రూరల్, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): రుద్రకోటలోని విక్కీ వైన్స్ సూపర్‌వైజర్ జరుగుమల్లి సందీప్‌పై కొందరు వ్యక్తులు గురువారం బీరు బాటిల్‌తో దాడి చేశారు. గుడ్లూరుకు చెందిన ముగ్గురు వ్యక్తులు క్యాషియర్‌గా పని చేస్తున్న హరితో గొడవ పడుతుండగా, అక్కడికొచ్చిన కొందరు సందీప్‌పై బీరు బాటిల్‌తో దాడి చేశారు. గాయపడిన సందీప్‌ను కావలి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బ్లేడుతో : కావలి పట్టణంలోని తుఫాన్ నగర్‌కు చెందిన ఉప్పాల వంశీపై గురువారం జంగాల కాలనీ సమీపంలో దావులూరు కొండయ్య, అక్కిలిగుంట ఎలేషా మరికొందరు బ్లేడుతో దాడి చేశారు. గాయపడిన వంశీని ఏరియా వైద్యశాలకు తరలించారు. వంశీ బంధువులకు అదే ప్రాంతానికి చెందిన దేవరకొండ సుధీర్‌కు మధ్య రెండు రోజుల క్రితం గొడవ జరిగింది. ఈ గొడవలో వంశీ సుధీర్ వైపు నిలబడటమే దాడికి కారణమని బాధితుడు తెలిపాడు. రెండవ పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	136
స్కిన్ చికెన్	242
స్కిన్‌లెస్	266

కోడిగుడ్ల ధర (100): 550

గ్రంథాలయం ఆకస్మిక తనిఖీ

ఉలవపాడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఉలవపాడులోని శాఖ గ్రంథాల యాన్ని ఉమ్మడి ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జీవీ శివారెడ్డి గురు వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాలనా సంబంధమైన రికార్డులు, పుస్తక సంప ద, చిన్నారులకు ఆకర్షణీయమైన పుస్తకాలు, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్త కాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాయలాభివృద్ధిలో భాగంగా ఎంపిక చేసిన ప్రతి కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. సెస్ కూడా సకాలంలో వసూలయ్యేలా చూడాలని గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావుకు సూచించారు.





రాళ్లపాడు ప్రాజెక్టు కట్టకు ఇరువైపులా

చిల్లచెట్ల తొలగింపు ప్రారంభం

లింగసముద్రం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టు కట్టకు ఇరువైపులా దట్టంగా ఉన్న చిల్లచెట్లను తొలగించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. వారం రోజులుగా సుమారు 3 కి.మీ పొడవున కట్టకు ఇరువైపులా ఉన్న చిల్లచెట్లను కూలీలు తొలగించారు. ప్రభుత్వం గతంలో ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువ కట్టల రోడ్డు, ప్రాజెక్టు కట్టకు ఉన్న చిల్లచెట్ల తొలగింపునకు రూ.75 లక్షలు మంజూరు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ నిధులలో రూ.72.30 లక్షలు రోడ్ల వెడల్పుకు కేటాయించగా, రూ.2.70 లక్షలు చిల్లచెట్ల తొలగింపునకు కేటాయించారు. ప్రాజెక్టు డీఈ ఎం వేంటకేశ్వర్లు ఆధ్వర్యంలో గుత్తేదారు ఈ పనులు చేయిస్తున్నారు. కట్ట లోపల చెట్ల తొలగింపు కార్యక్రమం 10 రోజులలో పూర్తవుతుందని, నెలన్నర వ్యవధిలో చెట్ల తొలగింపు ప్రక్రియ పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.



చెత్త సంపద తయారీ కేంద్ర నిర్మాణం

అర్ధంతరంగా ఆగిపోయిన పనులు

లింగసముద్రం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్నెబోయినపల్లిలో ఏడేండ్ల నుండి చెత్త సంపద తయారీ కేంద్రం పిల్లర్ల దశలోనే ఆగిపోయింది. దీంతో ఈ గ్రామానికి పంపిణీ చేసిన చెత్తను తరలించే రిక్షాలు నిరుపయోగంగా మారాయి. ఎండావానకు తుప్పుపట్టి పోతున్నాయి. 2018లో సుమారు రూ.6 లక్షలతో ఈ చెత్త సంపద తయారీ కేంద్రం నిర్మాణ పనులు చేపట్టారు. ఆ తర్వాత ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ కేంద్రాలను గురించి పట్టించుకోలేదు. రాష్ట్రప్రభుత్వం సుమారు 6 నెలల క్రితం పనులు పూర్తి చేసేందుకు సుమారు రూ. 9 లక్షలు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపించినట్లు తెలిసింది. నిధులు మంజూరైతే నిర్మాణ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.



హైవేపై ట్రాన్స్‌పోర్టు లారీ బోల్తా

● డ్రైవర్‌కి గాయాలు

కావలి రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి ఢిల్లీకి వెళ్తున్న వీఆర్‌ఎల్ ట్రాన్స్‌పోర్టు లారీ గురువారం తెల్లవారుజామున బోల్తా పడింది. కావలి పట్టణం వెంగయ్య గారిపాలెం క్రాస్ రోడ్డు సమీపంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై బ్రేక్‌డౌన్‌తో ఆగి ఉన్న లారీని వెనుక వైపు వీఆర్‌ఎల్ లారీ ఢీకొని అదుపుతప్పి వంతెన పైనుంచి కింద ఉన్న సర్వీస్ రోడ్డులోకి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆ లారీకి డ్రైవర్‌గా పనిచేస్తున్న రాజస్థాన్‌కు చెందిన షౌకత్ అలీకి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

న్యూస్ బాక్స్

జమ్మలపాలెంలో రీసర్వేపై గ్రామసభ



రీసర్వే వివరాలు వెల్లడిస్తున్న మండల సర్వేయర్ శోభన్

జలదంకి, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మలపాలెంలో గురువారం సర్పంచ్ బుర్రి శ్రీవేణి అధ్యక్షతన గ్రామ సచివాలయంలో రీసర్వే గ్రామసభ నిర్వహించారు. ఈసభలో ముసాయిదా భూమి రిజిష్టర్ (డిఎల్‌ఆర్)ను ప్రదర్శించారు. ముసాయిదా వివరాలను సర్వేయరు శోభన్ గ్రామసభకు హాజరైన రైతులకు వివరించారు. భూయజమానులు తమ భూములకు సంబంధించిన వివరాలను సచివాలయంలో అందుబాటులో ఉన్న రికార్డులను సరిచూసుకుని తప్పులు ఉంటే సవరించుకోవాలని డిటి జూలియాభాయ్ తెలిపారు. ఈ గ్రామసభలో భూయజమానులుతో పాటు వీఆర్వో మధు, గ్రామ సర్వేయరు క్రిష్టారెడ్డి, విఆర్‌ఏలు పాల్గొన్నారు.

రేపు మెగా లోక్ అదాలత్

అల్లూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కావలిలో శనివారం జరిగే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని లోక్ అదాలత్ సభ్యుడు ఎం మాలకొండారెడ్డి గురువారం ఓ ప్రకటనలో కోరారు. పెండింగ్ కేసులు, అపరిష్కృత కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని కోరారు. కలిగిరి, కొండాపురం, జలదంకి, కావలి, బోగోలు మండలాలకు చెందిన కక్షిదారులు ఈ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

● బంగారు, వెండి అపహరణ

కావలి రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కావలి మండలం ఆముదాలదిన్నె పంచాయతీ దూదేకులపాలెంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు బాధితుడు దాసరి పవన్‌కుమార్ గురువారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి వివరాల మేరకు... పవన్‌కుమార్ అలియాస్ పవన్‌స్వామి అన్నగారిపాలెం పంచాయతీ పూలదొరువులో శ్రీ నిలయం దేవస్థానం నిర్వహిస్తూ ఆముదాలదిన్నె పంచాయతీ దూదేకులపాలెంలో నివాసం ఉంటున్నాడు. గ్రామంలో అతనివద్ద గతం లో పనిచేసిన వారితో విభేదాలు ఉండటంతో గత 6 నెలలుగా పవన్‌కుమార్ దూదేకులపాలెంలోని ఇంటికి తాళం వేసి కావలిలో ఉన్న మరో ఇంట్లో, ఆశ్రమంలో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈనెల 9వ తేదీ రాత్రి ఇంటి గేటు తాళం పగలగొట్టి తలుపు తీసి ఉందని ఆ ముదాలదిన్నెకు చెందిన కొందరు తెలపటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సంఘటనా స్థలానికి పోలీసులతో పాటు బాధితుడి భార్య రజని వెళ్లి పరిశీలించగా పూజ గదిలో ఉన్న అమ్మవారి బంగారు విగ్రహం, కబ్‌బోర్డు లోని లాకర్‌లో ఉంచిన అమ్మవారి వెండి కవచాలు, బంగారు వస్తువులు దొంగిలించుకుపోయారు. వాటితో పాటు అతని వద్ద అప్పుతీసుకుని రాసిచ్చిన రూ. 47 లక్షలకు సంబంధించిన ప్రామిసరీ నోట్లు, చెక్కులు, డాక్యుమెంట్లు, టీవి, వంట సామగ్రి చోరీ చేసినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



స్థానికులను విచారిస్తున్న ఎస్‌ఐ తిరుమలరెడ్డి

కరేడు అభివృద్ధికి కట్టుబడి ఉన్నా... : ఎమ్మెల్యే ఇంటూరి

ఉలవపాడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కరేడు పంచాయతీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని కందుకూరు శాసనసభ్యుడు ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. గురువారం కరేడు పంచాయతీ పరిధిలోని బట్టియసోమయ్యపాలెంలో రూ.10 లక్షలు, అలగాయపాలెంలోని రెడ్డిపాలెంలో రూ.15 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఇప్పటికే రూ. 2 కోట్లతో తారు రోడ్డు, నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ఎంపీ వేమిరెడ్డి కోటాలో కేటాయించిన నిధులతో ఇప్పటికే సిమెంట్ రోడ్లు పూర్తి చేశామన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను దిగ్విజయంగా అమలు చేస్తున్నారని, సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నాడని కొనియాడారు. ఎమ్మెల్యేకి గ్రామస్తులు ఘనస్వాగతం పలకగా, రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు, గ్రామపార్టీ అధ్యక్షుడు ఆదాం, నాయకులు పోలుపోయిన శ్రీనివాసులు, మెట్టా శ్రీనివాసులు రెడ్డి, జెట్టి సుబ్బరామిరెడ్డి, వాయల జాలమ్మ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

ఎమ్మెల్యే ఇంటూరి సమక్షంలో

32 కుటుంబాలు టీడీపీలో చేరిక

కందుకూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం మండలం అంకభూపాలపురం వడ్డెపాలెంకు చెందిన 32 కుటుంబాలవారు గురువారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. గ్రామ టీడీపీ నాయకులు బక్కమంతుల మాల్యాద్రి, చెంచు శ్రీనివాసులు, పంది లక్ష్మీనారాయణ, బత్తుల సైదులు తదితరుల ఆధ్వర్యంలో వడ్డెపాలెంవాసులు కందుకూరు టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేని కలిశారు. వారందరినీ ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బత్తుల రమణయ్య, రాము, బండారు సీతారాములు, బండారు బ్రహ్మయ్య, బత్తుల వెంకటరత్నం, తమ్మిశెట్టి మాలకొండయ్య, బండారు శ్రీను, శేషగిరి, వెంకటేశ్వర్లు, వెంకటరామయ్య, ప్రసాద్, కొండయ్య, చినరాములు, సూర్యనారాయణ, కుంచాల శ్రీను, అంకమ్మరావు, బండారు చినవెంకటేశ్వర్లు, తమ్మిశెట్టి రమణయ్య తదితర 32 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ప్రజలు విసిగిపోయారని, అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని నమ్ముతున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజాసంక్షేమానికి తాను ఎల్లప్పుడూ కట్టుబడిఉంటానన్నారు. పార్టీలో కొత్తగా చేరిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, గౌరవం లభిస్తాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులమై, ఆయన నాయకత్వంపై నమ్మకంతో తెలుగుదేశం పార్టీలో చేరామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు ప్రగడ తిరుపాలు, ప్రగడ అనంతయ్య, పంది మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.



ఇంటూరి సమక్షంలో టీడీపీలో చేరిన అంకభూపాలపురం వడ్డెపాలెం వాసులు

9,314 గృహాలు ప్రవేశాలకు సిద్ధం

● పూర్తికావస్తున్న ఇళ్లనిర్మాణాలు ● నెరవేరనున్న పేదల కల

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నిరుపేదల సొంతింటి కల నెరవేరనుంది. వైసీపీ హయాంలో కేవలం ఆర్భాటాలకే పరిమితమై, నిర్లక్ష్యానికి గురైన గృహ నిర్మాణం గత ఏడాదిన్నర కాలంగా వేగం పుంజుకుంది. దీంతో ప్రభుత్వం ఎప్పుడు ముహూర్తం ఖరారుచేస్తే అప్పుడు లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 82,422 గృహాలను గత ప్రభుత్వంలో మంజూరవగా, 26వేలకుపైగా గృహాలను అప్పట్లో పూర్తిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత పాలనలో జరిగిన పక్కాగృహాలలో అవినీతి, అక్రమాలను వెలికి తీయడంతోపాటు మంజూరైన గృహాలను త్వరితగతిన పూర్తిచేసి పేదలకు అందించేందుకు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి జిల్లాలో పర్యటించి పక్కాగృహాల నిర్మాణాలపై అధికారులతో సమీక్షించారు. నాణ్యంగా ఇళ్లను నిర్మించి పేదలకు అందించాలని సూచించారు. రానున్న దసరాకు లేదా జనవరిలో తొలివిడత గృహప్రవేశాలు చేపట్టాలని జిల్లా అధికారులకు లక్ష్యాన్ని నిర్దేశించారు. మంత్రి ఆదేశాలతో అధికారుల్లో కదలిక మొదలై గృహ నిర్మాణాల్లో వేగం పెంచారు. శ్లాబ్‌లను పూర్తిచేసుకుని 9,314 ఇళ్లకు అన్ని పనులు పూర్తికావస్తున్నాయి. దీంతో ప్రభుత్వం ఎప్పుడు మహూర్తం నిర్ణయించినా లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.



నియోజకవర్గం	ఇళ్లు
కావలి	1,599
సర్వేపల్లి	1,538
ఉదయగిరి	1509
ఆత్మకూరు	1,327
కోవూరు	1,086
కందుకూరు	908
నెల్లూరు రూరల్	409
నెల్లూరు సిటీ	270
వెంకటగిరి	668
మొత్తం	9,314

చీకటి జీవో రద్దు చేయాలి : పీడీఎస్‌యూ

కావలి (టౌన్) సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి) చీకటి జీవో రద్దు చేయాలని పీడీఎస్‌యు జిల్లా అధ్యక్షుడు సునీల్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణం జనతాపేటలో చలో కలెక్టరేట్ కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రిక ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం 12వ తేదీన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని తలపెట్టామని, విద్యార్థులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వమొచ్చి 15నెలలు అయినప్పటికీ విద్యారంగ సమస్యలు పరిష్కారం కాలేదని, విద్యాశాఖా మంత్రి లోకేష్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు వెంటనే అమలుచేసి మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఇంతవరకు ఫీజు రీఎంబర్స్‌మెంట్ ఒక్క రూపాయి విడుదల చేయలేదని, కళాశాల యాజమాన్యాలు ఫీజులు కడితేనే పరీక్షల ఫీజు కట్టించుకుంటామని విద్యార్థులను వేధిస్తున్నారని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు కావలి ఇన్‌చార్జ్ శ్రావణ్, శ్రీను, హర్షిత్, వంశీ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ అధ్యక్షుడు సునీల్ తదితరులు

బాలికపై అత్యాచారం

● సచివాలయ ఉద్యోగిపై కేసు నమోదు

ఉలవపాడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో పిల్లల ఆలనాపాలన చూస్తున్న మైనర్ బాలికపై కామవాంఛ తీర్చుకున్న ఓ సచివాలయ ఉద్యోగిపై పోక్సోతోపాటు పలు సెక్షన్ల కింద గురువారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అంకమ్మ తెలిపారు. ఇందుకూరుపేట మండలం, మైపాడు సమీపంలోని కోడూరుకు చెందిన తొమ్మిదేళ్ల బాలికను తల్లిదండ్రులు కావలి సమీపంలోని ఏనుగుల బావి గ్రామానికి చెందిన కొండయ్యకు నాలుగేళ్ల క్రితం కూలి పనులు చేయడానికి అప్పగించారు. అప్పటి నుంచి బాలిక తల్లిదండ్రులు కొండయ్య వద్ద నుంచి ప్రతిఏటా కొంత డబ్బు తీసుకునేవారు. బాలికతో బాతుల సంరక్షణతో పాటు ఇంట్లో పనులు చేయిస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో ఉలవపాడులో కాపురం ఉంటున్న తన కూతురు ఇంటికి పిల్లల ఆలనాపాలన చూసేందుకు కొండయ్య గత ఏడాది ఆ బాలికను పంపించాడు. ప్రస్తుతం ఆ బాలికకు 13 ఏళ్లు. కొండయ్య అల్లుడు పొట్టిరాజు (రామకృష్ణ) సింగరాయకొండ సచివాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్నాడు. అయితే పొట్టిరాజు సదరు బాలికపై గత 20 రోజుల వ్యవధిలో 3 సార్లు అత్యాచారం చేశాడు. దీంతో భయబ్రాంతులకు గురైన బాలిక ఇంటి నుంచి బయటకు వచ్చేసింది. చాగొల్లు పరిసర ప్రాంతంలో తిరుగుతుండగా కోటేశ్వరమ్మ అనే మహిళ గమనించి బాలిక వివరాలు కనుక్కుని పోలీసులకు అప్పగించింది. జరిగిన ఘటనను బాలిక విచారణాధికారులకు వివరించింది. బాలిక ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా కొండయ్య, అతని భార్య, పొట్టిరాజు, అతని భార్య, బాలిక తల్లిదండ్రులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. బాలికను కొడవలూరు మండలం నార్త్‌రాజుపాలెంలోని విశ్వజనని బాలికల ఆశ్రమానికి పంపించారు.

మా భూములు ఇవ్వం.. మా గ్రామాన్ని ఖాళీచేయం

● కందుకూరు సబ్ కలెక్టరుతో ఉప్పరపాలెం దళితులు

కందుకూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : 'కరేడులో ఇండోసోల్ సోలార్ కంపెనీకి భూములు ఇవ్వము. గ్రామాన్ని ఖాళీ చేయబోమని కరేడు ఉప్పరపాలెం దళితులు కందుకూరు సబ్ కలెక్టరు దామెర హిమవంశీకి స్పష్టంచేశారు. కాలనీవాసులు, మహిళలు గురువారం కందుకూరులో సబ్ కలెక్టరును కలిసి తమ గోడు వినిపించారు. జూలై 4న కరేడులో జరిగిన గ్రామసభలో చేసిన తీర్మానాన్ని అమలు చేయాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి ప్రతి ఇల్లు తిరిగి వివరాలు సేకరిస్తూ బలవంతంగా సంతకాలు తీసుకునే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. అలాగే, 30 పోలీసుయాక్టును ఎత్తివేయాలని, తమకు మద్దతుగా ఆందోళనలు చేసిన ప్రజాసంఘాల నాయకులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టరు మాట్లాడుతూ అందరి ఆమోదంతోనే ఇళ్లు, భూములను తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప్పరపాలెంకు చెందిన గంజి చినకోటేశ్వరరావు, ప్రసాద్, అహోషేక్, శ్రీను, కొట్టే మాల కొండయ్య, రామకృష్ణాపురం గిరిజనులు కత్తి కొండమ్మ, యేసురాణి, సురేంద్ర, శిరీష, అర్చన, ప్రజాసంఘాల నాయకులు జీవీబీ కుమార్, వెంకటేశ్వర్లు, వీసం విజయ్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న ఉప్పరపాలెం దళితులు

టెన్నిస్ టోర్నమెంట్

విజేతలకు బహుమతులు



ట్రోఫీ అందుకుంటున్న విద్యుత్ శాఖ ఏఈ పీసీ జడరాయ


బిట్రగుంట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): టెన్నిస్ టోర్నమెంట్‌లో బోగోలు మండల విద్యుత్ శాఖ ఏఈ పీసీ జడరాయ, కొండాపురం లైన్‌మెన్ ఎన్ శ్రీనివాసులురెడ్డి విజేతలుగా నిలిచి బహుమతులు అందుకున్నారు. ఏపీ ఎలక్ట్రిసిటి కార్పొరేషన్ గుంటూరులో ఈనెల 9వ తేదీ నుంచి 11 వరకు టెన్నిస్, బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహించారు. నెల్లూరు సర్కిల్ టెన్నిస్ జట్టు నుంచి జడరాయ, శ్రీనివాసులు పోటీలో ప్రత్యర్థులతో తలపడి ద్వితీయ స్థానం సాధించారు. అలాగే ఓపెన్ సింగిల్ కేటగిరిలో నెల్లూరు నుంచి పీసీ.జడరాయ, గుంటూరు నుంచి మహేష్ జాయింట్ విన్నర్స్‌గా నిలిచారు. విజేతలు సీపీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పీ.పుల్లారెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.

డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాల్లో 'శ్రీగాయత్రి' ప్రతిభ

కందుకూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ప్రకటించిన డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాల్లో శ్రీగాయత్రి విద్యాపరిషత్ డిగ్రీ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు చక్కటి ఫలితాలు సాధించారని కాలేజీ కరస్పాండెంట్ సీహెచ్ రామకృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీఏ(ఏఐ)లో వల్లెపు నాగలక్ష్మి 94 శాతంతో కాలేజీఫస్ట్‌గా నిలవగా బీసీఏ (కంప్యూటర్ సైన్స్)లో యుఎస్‌పీపీ సువర్ణిణి 92 శాతం మార్కులతో కాలేజీ ఫస్ట్ సాధించిందని తెలిపారు. విద్యార్థినీవిద్యార్థులను కళాశాల డైరెక్టర్ భరద్వాజ్, ప్రిన్సిపాల్ పీ గీతా శ్రీనివాసరావు, అధ్యాపకులు అభినందించారు.

ఎన్‌సీసీ కేడెట్లకు సర్టిఫికెట్ల ప్రదానం

కావలి(టౌన్), సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పాతూరులో మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం ఎన్‌సీసీ కేడెట్లకు ఎ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని శారద, ఎన్‌సీసీ అధికారి మస్తాన్‌వలి, హవల్దార్ లక్ష్మణ్‌లు కేడెట్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేసి అభినందించారు. ప్రధానోపాధ్యాయిని సుజాత మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు దేశభక్తి, జాతీయవాదం, క్రమశిక్షణ ఎంతైనా అవసరమని, ఎన్‌సీసీతో సాధ్యమన్నారు. మస్తాన్‌వలి మాట్లాడుతూ ఎ సర్టిఫికెట్లతో ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందేందుకు, ఉన్నత విద్య, ఉద్యోగాలు పొందేందుకు అవకాశముందన్నారు.



ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్లు సాధించిన కేడెట్లు, పక్కన ప్రధోపాధ్యాయిని ఉపాధ్యాయులు

సమస్యలు పరిష్కరించకపోతే నిరసన

● ఎంపీడీవోకు సచివాలయ సిబ్బంది వినతి

వలేటివారిపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని సచివాలయ సిబ్బంది తెలిపారు. వలేటివారిపాలెం ఎంపీడీఓ నరేంద్రదేవ్‌కు గురువారం మండల సచివాలయ సిబ్బంది వినతిపత్రం అందజేశారు. ఇంటింటి సర్వేల నుండి విముక్తి కలిగించాలని తెలిపారు. సమయపాలనకు సంబంధించి నిబంధనలు సడలించాలని కోరారు. సెలవులు, పండుగలతో పాటు, ఆదివారం కూడా విధులు నిర్వర్తించాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని సచివాలయ సిబ్బంది కోరుతున్నారు.



ఎంపీడీవో నరేంద్రదేవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ సిబ్బంది



పాలోమంటూ పోలేరమ్మ జాతరకు..



అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తజనం

విరూపోత్సవంతో ముగిసిన వేడుక

వెంకటగిరి/వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 11: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర జనసంద్రాన్ని తలపించింది. గురువారం ఉదయం 4 గంటలకే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. బుధవారం రాత్రి చాకలింటి నుంచి ఊరేగింపుగా వచ్చిన అమ్మవారిని.. గురువారం వేకువజామున ఆలయం వద్ద వేపమండలతో వేసిన పందిరిలో కొలువు దీర్చారు. అప్పట్నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. వేయికళ్ల దుత్తల్లో బియ్యపు పిండితో చేసిన ప్రమిదలలో నూనె దీపాలు వెలిగించి భక్తులు నెత్తిన పెట్టుకు వచ్చి నాలుగు కూడల్లో బద్దలు కొట్టారు. మడిచీరలపై ఆసాదుల తప్పెట్ల నడుమ మరికొందరు. నవధాన్య మొలకలను అమ్మవారికి సమర్పించారు. రాజాల ప్యాలస్ నుంచి ఆభరణాలైన బంగారు శూలం, సరుడును రాజా అనుచరుల ఆధ్వర్యంలో అమ్మవారికి అలంకరించి తీసుకెళ్లారు. నగరి సారెలైన సరవళ్లను రాజా అనుచరులు అమ్మవారికి 12గంటలకు సమర్పించారు. దీంతో వెట్టివారు కుండలో వెలిగించిన గండర దీపాన్ని అమ్మవారికి చూపించి దీపం ఆరకుండా ఊరి పొలిమేరల్లోకి తీసుకెళ్లారు. అక్కడ అమ్మవారి బలి దున్నపోతును బలిచ్చి ఆ రక్తంతో పొలికుండల్లోని అన్నంతో కలిపి ఊరి పొలిమేరల్లో పొలి..పొలి అని అరుస్తూ చల్లారు. అనంతరం దీపాన్ని విరూప మండపానికి తీసుకెళ్లారు. దున్నపోతు రక్తంతో తడిచిన కత్తిని అమ్మవారికి చూపాక.. రాజాల ప్యాలెస్‌లో పూలతో అలంకరించిన ట్రక్కులో అమ్మవారి ప్రతిమను సాయంత్రం 4 గంటలకు భక్త జనసందోహం నడుమ ఊరేగించారు. శివాలయం వద్దకు ఊరేగింపు చేరుకోగా, అమ్మవారికి అలంకరించిన ఆభరణాలను తీసేశారు. అనంతరం కైవల్యానది మీదుగా మల్లయ్య తోట వద్ద ఏర్పాటు చేసిన విరూప మండపానికి అమ్మవారు చేరుకోగా, 7.35 గంటలకు ప్రతిమను విరూపం చేసే కార్యక్రమం ముగిసింది. అప్పటి వరకు గండర దీపం ఆరిపోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అమ్మవారి ప్రతిమ మట్టిని ఇంట ఉంచుకుంటే అష్టైశ్వర్యాలు కలుగుతాయని, తింటే రోగాలు దూరమవుతాయన్నది భక్తుల నమ్మకం. అందుకని మట్టి కోసం భక్తులు పోటీపడటంతో విరూప మండపం వద్ద కొంత ఉద్రిక్తత నెలకొంది.



బస్సులో స్వస్థలాలకు..

హమ్మయ్య.. వచ్చేశాం!

- ఆశలు వదులుకున్న మాకు ప్రభుత్వం ప్రాణం పోసిందంటూ భావోద్వేగం
- నేపాల్ నుంచి రేణిగుంట చేరుకున్న 40 మందికి ఘన స్వాగతం

తిరుపతి(వైద్యం)/రేణిగుంట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విహార యాత్రలో భాగంగా నేపాల్ వెళ్లారు. అక్కడ నెలకొన్న అల్లర్ల నేపథ్యంలో ఏర్పడిన తీవ్ర ఉద్రిక్తత పరిస్థితుల్లో చిక్కుకున్నారు. తిరిగి ఇళ్లు చేరగలమా అని ఆందోళన చెందారు. అలాంటి వారికి ప్రభుత్వం అండగా నిలిచింది. నేపాల్ నుంచి రప్పించింది. అలా తిరుపతి జిల్లాకు చెందిన 9 మంది, కడప జిల్లా 19, నెల్లూరు జిల్లా చెందిన ఐదుగురు, అన్నమయ్య జిల్లాకు చెందిన ముగ్గురు, అనంతపురం జిల్లాకు చెందిన ఇద్దరు, నంద్యాల జిల్లాకు చెందిన 2.. మొత్తం 40 మంది గురువారం రాత్రి 10.55 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఉద్విగ్నత, ఉత్సాహం, భావోద్వేగానికి గురయ్యారు. వీరికి ఎయిర్‌పోర్టులో కలెక్టర్ వెంకటేశ్వర్‌తోపాటు తిరుపతి, చంద్రగిరి, పూతలపట్టు, కడప, కోడూరు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, మురళీమోహన్, మాధవిరెడ్డి, శ్రీధర్, శాప్ చైర్మన్ రవినాయుడు, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ తదితరులు స్వాగతం పలికారు. ప్రయాణం ఎలా సాగిందని అడిగారు. ప్రభుత్వ చొరవ, నారా లోకేష్ కృషి లేకుంటే తాము స్వదేశానికి చేరుకునే వాళ్లం కాదంటూ వారంతా భావోద్వేగానికి లోనయ్యారు. వీరికి తిరుమల శ్రీవారి, శ్రీకాళహస్తీశ్వరస్వామి ప్రసాదాలను అందజేశారు. విమానాశ్రయంలో భోజన వసతి కల్పించారు. అనంతరం ప్రత్యేక వాహనాల్లో వారిని స్వస్థలాలకు తరలించారు.





నేపాల్ నుంచి వచ్చిన వారితో ఎమ్మెల్యేల మాటా మంతి



ఇప్పటికీ భయమేస్తుంది

నేపాల్లో మేము చూసిన పరిస్థితులను తలుచుకుంటే ఇప్పటికీ భయమేస్తుంది.ఇక అయిన వారిని చూడలేమని, ప్రాణాలతో బయటపడలేమనే పరిస్థితులకొచ్చాం. అలాంటి మమ్మల్ని బయట పడేసి సురక్షితంగా ఇళ్లకు చేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం కృషి ప్రశంసనీయం.

- చంద్రశేఖర్‌రావు, తిరుపతి



తిరిగి వస్తామనుకోలేదు

విహారయాత్ర కాస్త మా కుటుంబంలో విషాద యాత్రగా మారుతుందనుకున్నాను. అక్కడ పరిస్థితులు చూస్తే ఆ విధంగానే ఉన్నాయి. బయటకు అడుగు పెట్టాలంటే భయం. హోటళ్లో ఉండాలన్నా వాటిపైనా దాడులు. అటువంటి పరిస్థితుల నుంచి బయట పడేసి సురక్షితంగా ఇంటికి చేరుకోవడం ఆనందంగా ఉంది.

- లోహిత, రేణిగుంట



నా భార్యకు తగిలే దెబ్బలు చూసి..

ఈ నెల 5న నా భార్య శ్రీదేవితో కలిసి నేపాల్ వెళ్లా. మేము ఉంటున్న హోటల్‌పై ప్రజలు తీవ్రంగా దాడికి పాల్పడ్డారు. ఆ దాడిలో నా భార్య బాగా గాయపడింది. నా ప్రాణాలు విలవిల్లాడాయి. హోటల్లో నుంచి బయటకు కూడా రాలేమనుకున్న పరిస్థితుల్లో ఏకంగా ఇంటికే తీసుకురావడం ఎంతో సంతోషంగా ఉంది. ఇందుకు కృషి చేసిన ప్రభుత్వానికి రెండుచేతులు జోడించి కృతజ్ఞతలు తెలుపుకొంటున్నా.

- నాగేంద్రప్రసాద్, కడప



మా వాహనాలపై రాళ్లు విసిరారు

పశుపతినాథ్ ఆలయాన్ని దర్శించుకుని మనదేశ సరిహద్దుకు వస్తున్న మా వాహనాలపై అక్కడి వారు రాళ్లు విసిరారు. ప్రాణాలతో బయటపడి బిక్కు బిక్కుమంటున్న మేము రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ఊపిరి పీల్చుకున్నాం. 24 గంటల్లో సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోగలిగాం.

- ప్రకాష్ బాబు, మదనపల్లె



రెండు రోజులు హోటళ్లకే పరిమితమయ్యాం

ఈనెల 1న కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి నేపాల్ వెళ్లాం. అన్ని ప్రాంతాలు చూసుకుని తిరుగు ప్రయాణమయ్యే సమయంలో అక్కడి పరిస్థితులు అనూహ్యంగా మారిపోయాయి. స్థానికులు మా బస్సుపై దాడి చేశారు. రెండు రోజులు హోటళ్లకే పరిమితమయ్యాం. కూటమి ప్రభుత్వం స్పందించి మమ్మల్ని గమ్యస్థానాలకు చేర్చేందుకు ఏర్పాట్లు చేయడం ఆనందం కలిగించింది.

- రాజేశ్వరి, కడప



బస్సులోనే ప్రాణాలు పోతాయనుకున్నాం

మా బస్సును వందల మంది ఒక్కసారిగా వచ్చి చుట్టుముట్టి రాళ్లతో దాడులకు తెగబడ్డారు. ఆ దాడిలో బస్సులోని వారు అనేక మంది గాయపడ్డారు. మాకు కూడా రాళ్ల దెబ్బలు తగిలాయి. మా ప్రాణాలు బస్సులోనే పోతాయి అనుకున్నాం. ఆ సమయంలో కొందరు పోలీసులు అక్కడకు చేరుకొని ఆందోళనకారులను చెల్లాచెదురు చేశారు. అక్కడి పరిస్థితులను చూసి ఇక ప్రాణాలతో తిరిగి వస్తామనుకోలేదు. అంతటి పరిస్థితులు కొనసాగుతున్న దేశంలో నుంచి మమ్మల్ని స్వదేశానికి తీసుకువచ్చిన ప్రభుత్వానికి, మంత్రి లోకేశ్‌కు శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం.

- మల్లికార్జున్, శశికళ దంపతులు, అనంతపురం



పరిపాలనా భవనంలో స్వామి చిత్రపటానికి హారతి ఇస్తున్న ఈవో సింఘాల్





తన ఛాంబర్‌లో ఫైలుపై సంతకం చేస్తున్న ఈవో

టీటీడీ పరిపాలనా భవనంలో ఈవో

తిరుమల, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): ఈవోగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన అనిల్‌కుమార్ సింఘాల్ గురువారం తిరుతిలోని టీటీడీ పరిపాలనా భవనంలోని పలు శాఖలను సందర్శించారు. అకౌంట్స్, అన్నదానం, బోర్డు సెల్, ఐటీ, సోషల్‌మీడియా, ఇంజినీరింగ్, ఎడ్యుకేషన్, ప్రజా సంబంధాలు, ఎస్టేట్ కార్యాలయాలను సందర్శించి అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ఉద్యోగులు ఈవోకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు పద్మావతి, గోవిందరాజస్వామి, కపిలేశ్వర స్వామి, కోదండరామ స్వామి ఆలయాల నుంచి వచ్చిన వేదపండితులు ఈవోకు ఆయన చాంబర్‌లో ఆశీర్వచనం చేశారు. ఈవో పలు ఫైళ్లను పరిశీలించి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఈవో సిబ్బందితో మాట్లాడుతూ, అధికారులు, ఉద్యోగులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని సేవలను వేగవంతం చేయాలని సూచించారు.

ఎస్వీఎంసీలో డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల గడువు పొడిగింపు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాలలో రెండేళ్ల కాలవ్యవధి పారామెడికల్ డిప్లొమా (అల్లైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్) కోర్సులకు సంబంధించిన దరఖాస్తుల గడువును ఈనెల 27వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీలో ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నాలజీ 30 సీట్లు, డిప్లమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ 30 సీట్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. దరఖాస్తు కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీపీఎంటీ.సీవో.ఇన్ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు. పూర్తి వివరాలకు 9440879943ను సంప్రదించాలని పేర్కొన్నారు.

15న మారిషస్ ప్రధాని రాక

తిరుపతి (కలెక్టరేట్), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మారిషస్ ప్రధాని డాక్టర్ నవీన్ చంద్రరామ్ గులాం సతీసమేతంగా ఈనెల 15న రానున్నారు.ఆరోజు ఉదయం ప్రత్యేక విమానంలో 1గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు.అక్కడి నుంచి రామచంద్రాపురం మండలం సి.రామాపురంలోని బహ్మర్షి ఆశ్రమాన్ని సందర్శిస్తారు. మధ్యాహ్నం 2.30గంటలకు తిరుమల చేరుకుంటారు. 3గంటలకు శ్రీవారిని దర్శించుకోనున్నారు. 5గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని ఢిల్లీ వెళతారు.

మహిళా సాధికారత సదస్సుపై అధికారులకు శిక్షణ

- శాసనసభ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసన్నకుమార్,వేదికపై జేసీ తదితరులు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి కేంద్రంగా ఈ నెల 14, 15వ తేదీల్లో జరిగే జాతీయమహిళా సాధికరత సదస్సు విజయవంతానికి లైజన్ అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో సదస్సుకు సంబంధించి లైజన్ అధికారుల శిక్షణా కార్యక్రమానికి జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ప్రతి ప్రజాప్రతినిధికి ఒక లైజన్ అధికారి,ప్రతి రాష్ట్రానికీ ఒక నోడల్ అధికారిని కేటాయిస్తామన్నారు. జేసీ శుభం బన్సల్ మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల మహిళా ప్రజాప్రతినిధులు, సామాజిక సేవా సంస్థలప్రతినిధులకు నగరంలోని పలు హోటల్స్‌లో బస ఏర్పాటు చేశామన్నారు. వారికి లోటుపాట్లు లేకుండా లైజన్ అధికారులు చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో తిరుపతి స్మార్ట్‌సిటీ జనరల్ మేనేజరు చంద్రమౌళి, అధికారులు పాల్గొన్నారు.

జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్ బదిలీ

- నూతన డీఎఫ్‌వోగా సాయిబాబా -

మంగళం, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్‌ను నెల్లూరు జిల్లా ఆంధ్రప్రదేశ్ ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రీజనల్ డైరెక్టర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆత్మకూరు టైగర్ ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబాను తిరుపతి జిల్లా అటవీశాఖ అధికారిగా నియమించారు. అలాగే తిరుపతి బయోట్రిమ్ స్టేట్ సెల్వి కల్చరిస్టు నరేందిరన్‌ను అమరావతిలోని పీసీసీఎఫ్ డిప్యూటీ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్టుగా బదిలీ చేశారు. గతంలో తిరుపతి జూపార్కు క్యూరేటర్‌గా పనిచేసిన బబితను బయోట్రిమ్ స్టేట్ సెల్వి కల్చరిస్టుగా నియమించారు.

సెట్విన్ సీఈవోగా యశ్వంత్

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సెట్విన్ సీఈవోగా డాక్టర్ పి.యశ్వంత్ నియమితులయ్యారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ క్యాడర్‌తో ఈయన డిప్యూటేషన్‌తో ఇప్పటి వరకు విజయవాడలోని పశుపోషణ విభాగం సంచాలకులుగా ఉన్నారు. ఏడాది కాలపరిమితితో డిప్యూటేషన్‌పై తిరుపతి జిల్లా సెట్విన్ సీఈవోగా బదిలీ అయ్యారు.



కార్యక్రమంలో పాల్గొన్న వేద పండితులు

ఘనంగా పార్థసారథి భట్టాచార్యుల జయంతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వేద పరిరక్షణకు రొంపిచెర్ల పార్థసారథి భట్టాచార్యుల విశేష కృషి చేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు. వేద విశ్వవిద్యాలయ వైఖానసాగమ విభాగంలో 'పార్థసారథి భట్టాచార్యుల జయంతి సభ గురువారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో మంగళగిరికి చెందిన వైఖానసాగమ పండితులు దీవి శ్రీనివాసాచార్యులు, వర్సిటీ అకడమిక్ డీన్ గోలి సుబ్రమణ్యశర్మ, పార్థసారథి భట్టాచార్యుల తనయుడు శత్రుఘ్నాచార్యులు, తిరుమల వైఖానస దివ్య సిద్ధాంత వివర్ధిని, రాఘవ దీక్షితులు, శ్రీనివాస దీక్షితులు, ప్రభాకరాచార్యులు, తదితరులు పాల్గొని మాట్లాడారు. ఆంధ్ర, కన్నడ, తమిళ ప్రాంతాల్లో పార్థసారథి భట్టాచార్యులు తిరిగి ఎంతో విలువైన వేద విజ్ఞానాన్ని వెలుగులోకి తీసుకొచ్చారని శ్లాఘించారు. తిరుమలలో వైఖానస ఆశ్రమాన్ని నిర్మించారన్నారు. వైఖానస గ్రంథాలను ముద్రించారన్నారు. రెండేళ్ళుగా వైఖానసాగమంలో ప్రతిభ కనబరిచిన హరిచరణ్, సాయిగౌతమ్‌లను రూ.5 వేల చొప్పున నగదు బహుమతితో సత్కరించారు.



శ్రీముఖి - రమేష్‌బాబు, నారాయణరావు - బొలిశెట్టి శ్రీనివాస్

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఆర్టీసీ చైర్మన్ నారాయణరావు, ప్రభుత్వ చీఫ్‌విప్ బొలిశెట్టి శ్రీనివాస్, విప్ గణబాబు, ఎమ్మెల్యేలు రమేష్, చింతమనేని ప్రభాకర్, మాజీ మంత్రి కిల్లి కృపారాణి, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ ఉన్నారు. సినీనటి, యాంకర్ శ్రీముఖి వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.56 కోట్లు
బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,086
తలనీలాలు సమర్పించినవారు: 28,239





ఎటు చూసినా భక్త జనమే

వెంకటగిరి/వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వచ్చే వాళ్లు వస్తుంటే.. పోయే వాళ్లు పోతుంటే.. ఎటు చూసినా భక్తజనమే. వెంకటగిరి పోలేరమ్మ జాతరకు గురువారం భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి వీఐపీలు ఎక్కువ కావడంతో సామాన్య భక్తులు ఇబ్బంది పడ్డారు. క్యూలైన్ వద్ద కొందరు భక్తులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కొందరు పోలీసు సిబ్బంది తమవారికి దర్శనం చేయించడానికి ప్రాధాన్యం ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. రూ.100, రూ.300, రూ.500 క్యూ ప్రవేశాలు పెట్టినా, వీవీఐపీ దర్శనంలో ఫ్రీగా వదిలి వేశారు. జాతరను నిర్వహించడంలో అధికారులను సమన్వయం చేసుకుంటూ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నీ తానై వ్యవహరించారు.



భక్తుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

జాతర ప్రశాంతం

ఎలాంటి గొడవలు లేకుండా జాతర ప్రశాంతంగా జరిగింది. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు దగ్గరుండి బందోబస్తును పర్యవేక్షించారు. క్యూలైన్‌లో భక్తులకు నీటి సరఫరా చేయాల్సిన ఎండోమెంట్, మున్సిపాలిటీ చేతులు ఎత్తివేశారు. దీంతో క్యూలైన్‌లో భక్తుల ఇబ్బందులు గుర్తించిన ఎస్పీ.. నీటిని అందివాల్సిందిగా పోలీసులను ఆదేశించారు. దీంతో గూడూరు డీఎస్పీ గీతాకుమారి సిబ్బందితో కలిసి క్యూలైన్‌లో భక్తులకు నీళ్ల బాటిళ్లను అందించారు. మద్యం మత్తులో కొందరు ఆకతాయిలు పోలీసులు పట్ల దురుసుగా వ్యవహరించినా సుత్తిమెత్తగా మందలించి పంపించేశారు.

అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ

పోలేరమ్మ జాతర రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందడంలో ప్రభుత్వం తరపున దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, దేవదాయశాఖ శాఖ కమిషనరు రామచంద్ర నాయుడు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పోలేరమ్మకు భక్తులు పొంగళ్లు పెట్టేందుకు మండపం నిర్మిస్తామని తెలిపారు. పోలేరమ్మ జాతరకు రాష్ట్ర గుర్తింపుతో పాటు.. జాతర నిర్వహణకు రూ.40లక్షలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తన డబ్బుతో క్రాస్‌రోడ్డు వద్ద అమ్మవారి ఆర్చి నిర్మించారన్నారు. ఆయన కోరిక మేరకు పాలకేంద్రం వద్ద మరో ఆర్చిని ప్రభుత్వ నిధులతో నిర్మించనున్నట్లు చెప్పారు. అమ్మవారి దేవస్థానానికి ఆర్థిక వనరులు సమకూర్చేలా దక్షిణపు వీధిలో 75 అంకణాల స్థలాన్ని దేవస్థానికి చెందేలా రాయించి, అందులో రూ.1.65 కోట్లతో జ్ఞాన మందిరం, కమర్షియల్ కాంప్లెక్సు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త కొండేపాటి గంగాప్రసాద్, పోలేరమ్మ దేవస్థానం ట్రస్టు చైర్మన్ గొల్లగుంట మురళీకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

రోజా వ్యాజ్యంపై వివరాలు సమర్పించండి

నగరి పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నగరి టీడీపీ ఎమ్మెల్యే గాలిభానుప్రకాశ్‌పై కేసు నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఆర్‌కె రోజా వేసిన వ్యాజ్యంలో వివరాలు సమర్పించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. విచారణ ఈ నెల 16కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. నగరి టీడీపీ ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేసినప్పటికీ నగరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేయడంలేదని పేర్కొంటూ రోజా హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ ఏడాది జూలై 17న తాను ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

ఐఐటీలో ఐదుగురు ప్రొఫెసర్లకు ఉత్తమ సేవా అవార్డుల ప్రదానం



అవార్డులు అందుకున్న ప్రొఫెసర్లతో డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ

ఏర్పేడు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఐదుగురు ప్రొఫెసర్లకు టీచర్స్‌డే సందర్భంగా ఉత్తమ సేవా అవార్డులను ప్రదానం చేశారు. ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, ఐఐటీ మద్రాస్‌కు చెందిన ఎలక్ట్రికల్ ఇంజనీర్ విభాగం హెడ్ భాస్కర్ రామమూర్తి ముఖ్యఅతిథిగా విచ్చేసి అవార్డులు ప్రదానం చేశారు. బెస్ట్ రీసెర్చ్ అవార్డును ప్రొఫెసర్ రవిశంకర్, ప్రొఫెసర్ ఎం.షికావుద్దీన్, బెస్ట్ టీచర్స్ అవార్డును రాఘవేంద్ర, ఎం.పంచాత్రం అందుకున్నారు. యంగ్ రీసెర్చ్ అవార్డును అభిషేక్ కుమార్ అమదుకున్నారు.

గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్‌గా పద్మావతి వర్సిటీ విద్యార్థిని



చంద్రికను అభినందిస్తున్న వీసీ ఉమ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ బీటెక్ సీఎస్‌ఈ నాల్గవ సంవత్సర విద్యార్థిని కుంచెల చంద్రిక గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్‌గా నియమితులయ్యారు. గూగుల్ టెక్నాలజీపై స్వల్పకాలిక అవగాహన, శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం చంద్రికకు కలిగింది. వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని అభినందించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ మల్లికార్జున, హెడ్ సరిత పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు 24మంది

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో వచ్చేనెల నిర్వహించనున్న రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు 24మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. శ్రీనివాస క్రీడా సముదాయంలో గురువారం జరిగిన అండర్ 11, 14, 17, 19 విభాగాలలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 112మంది ప్రాతినిధ్యం వహించారు. ప్రతి విభాగం నుంచి ముగ్గురు చొప్పున బాలబాలికలు విజయం సాధించారు. జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శులు కిషోర్‌కుమార్, భార్గవి, స్కేటింగ్ కోచ్ ప్రేమ్‌నాథ్ అభినందించారు. అంతకుముందు శాప్ చైర్మన్ రవినాయుడు క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రతిభచాటాలని ఆకాంక్షించారు. వ్యాయామ ఉపాధ్యాయులు గాంధీ, శోభన్‌బాబు, శ్రీధర్, వినోద్ పాల్గొన్నారు.



స్కేటింగ్ క్రీడాకారులతో శాప్ చైర్మన్ రవినాయుడు

గంగమ్మ గుడి చైర్మన్‌గా మహేష్ యాదవ్



తిరుపతి, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ చైర్మన్‌గా టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్ నిమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు వచ్చాయి. సభ్యులుగా టీడీపీ నుంచి ఎం.గుణ, జి.భాగ్యవల్లి, బి.సుబ్రమణ్యం, శ్యామల, లక్ష్మణరావు, జనసేన నుంచి రుద్రకిషోర్, మధులత, వరలక్ష్మి, విమల, బీజేపీ నుంచి టి.చంద్రశేఖర్, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఆలయ ప్రధాన అర్చకుడు మురళి నియమితులయ్యారు.

తిరుమలలో కేంద్రమంత్రి నిర్మల సీతారామన్



కేంద్ర మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల,సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి నిర్మల సీతారామన్ శ్రీవారి దర్శనార్థం గురువారం తిరుమలకు వచ్చారు.తిరుమలలోని గాయత్రి గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న ఆమెకు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళికృష్ణ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.. నిర్మల సీతారామన్ రాత్రికి తిరుమలలోనే బస చేసి శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుంటారు.

నెలలో అగ్నిమాపక పరికరాల వివరాలు తెలపాలి

భవన యజమానులకు అగ్నిమాపక శాఖ సూచన

విజయవాడ (వన్‌టౌన్), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని భవన యజమానులు నెల రోజుల్లోపు వారి భవనాలలో అగ్నిమాపక పరికరాల వివరాలను తెలియజేయాలని రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ సంచాలకుడు రమణ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి మధ్యవర్తులను ఎవరినీ సంప్రదించవద్దని, ఏదైనా సమాచారం కావాలంటే 9441236448 నెంబరులో కానీ, కనెక్ట్ డీజీ ఫైర్ జీ మెయిల్‌లో కానీ సంప్రదించాలని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైకోర్టు తీర్పు మేరకు 2021-22 సంవత్సరంలో అగ్నిమాపక శాఖ జారీ చేసిన నిరభ్యంతర ధ్రువపత్రాలను సవరిస్తూ జారీ చేసిన ప్రభుత్వ గెజిట్ మేరకు అగ్నిమాపక చట్టం 1999కి అనుగుణంగా హైరైజెడ్ భవనాలలో అగ్నిమాపక పరికరాలను ఏర్పాటు చేయటానికి సమయం ఇచ్చినట్టు వెల్లడించారు. భవన యజమానులు 30 రోజుల్లో ఈ వివరాలను అందించాలని, అదనపు సమయం అవసరమైతే అగ్నిమాపక శాఖకు రాతపూర్వకంగా విజ్ఞప్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు. చట్టానికి అనుగుణంగా భవనాల్లో అగ్నిమాపక పరికరాలు ఉన్నట్లయితే రివైజ్డ్ నిరభ్యంతర (ఎన్‌వోసీ) జారీ చేస్తామని తెలిపారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి: మౌర్య

తిరుపతి, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి):జాతీయ మహిళా సాధికారిత సదస్సుకు సంబంధించి నిర్దేశిత విధులను అధికారులు బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య ఆదేశించారు. గురువారం ఆమె అధికారులతో సమావేశమయ్యారు. ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. అలసత్వం వహించకుండా సమర్థంగా పనిచేయాలన్నారు. అతిథులకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలన్నారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, స్మార్ట్‌సిటీ జీ.ఎం. చంద్రమౌళి, తుడా ఈఈ రవీంద్ర, మునిసిపల్ ఇంజినీర్లు, వివిధ విభాగాల అధికారలు పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

● భయాందోళనతో పరుగులు తీసిన స్థానికులు



ట్రాన్స్‌ఫార్మర్‌లో చెలరేగుతున్న మంటలు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని ఆర్డీవో కార్యాలయ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో గురువారం రాత్రి అకస్మాత్తుగా భారీ శబ్ధంతో పేలి మంటలు చెలరేగాయి. సరిగ్గా 7 గంటల సమయంలో ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉన్నట్లుండి మంటలు చెలరేగి చుట్టుపక్కలకు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురై పరుగులు తీశారు. అదే సమయంలో నూతనంగా నియమితులైన రైతుసేవా సహకార సంఘ అధ్యక్షుడు బాలచంద్ర కిషోర్ అభినంద సభకు టీడీపీ నాయకులు ర్యాలీగా వెళ్తున్నారు. మంటలు భారీగా వ్యాపించడంతో అక్కడున్న వారందరూ అరుస్తూ పరుగులు తీశారు. వెంటనే విద్యుత్ శాఖ అధికారులు సమాచారం తెలుసుకుని విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపుచేశారు. దాదాపు రెండు గంటల పాటు విద్యుత్‌కు అంతరాయం కలిగింది. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

తెగిపడిన విద్యుత్ మెయిన్ లైన్

● నాలుగు ఆవులు మృతి



విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన ఆవులు

కోట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కోట మండలం వావిళ్లదొరువు వద్ద గురువారం విద్యుత్ మెయిన్‌లైన్ తెగి మేతమేస్తున్న నాలుగు ఆవులపై పడటంతో అవి అక్కడికక్కడే మృతి చెందాయి. గోవిందపల్లికి చెందిన కరీముల్లా, చినవెంకటయ్య, ఆదిమూర్తికి చెందిన ఆవులను కరీముల్లా అనే పశువులకాపరి వావిళ్లదొరువువద్ద పొలాల్లోకి మేత కోసం తోలుకెళ్లారు. ఆవులు మేత మేస్తున్న సమయంలో 33/11 కేవీ కొత్తపట్నం వెళ్లే విద్యుత్ మెయిన్‌లైన్ ఒక్కసారిగా తెగి వాటిపై పడింది. దీంతో ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. సమాచారం తెలుసుకున్న ఆవుల యజమానులు లబోదిబోమంటూ గుండెలు బాదుకున్నారు.

వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న బీజేవైఎం రాష్ట్ర అధికారప్రతినిధి మనోజ్‌కుమార్

గూడూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మనదేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానందను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో దిగ్విజయ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1893లో చికాగో మహాసభల్లో సెప్టెంబరు 11వ తేదీన మన దేశ గొప్పతనాన్ని, సంస్కృతి, సాంప్రదాయాలను ప్రపంచ దేశాలకు స్వామివివేకానంద చాటిచెప్పిన రోజును దిగ్విజయ్ దివస్‌గా జరుపుకుంటున్నట్లు చెప్పారు. ఆయన స్ఫూర్తితో యువత దేశాభివృద్ధి కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున, శివశంకర్, చైతన్య, మస్తాన్, నవీన్, కిరణ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

తడలో ఓ మోస్తరు వర్షం




ఎంఈవో కార్యాలయం ముందు నిలిచి ఉన్న వర్షపునీరు

తడ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తడలో బుధవారం రాత్రి ఓ మోస్తరుగా వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో ప్రారంభమైన ఈ వర్షం గురువారం తెల్లవారుజాము వరకు కొనసాగింది. స్థానిక ఎంఈవో కార్యాలయం తదితర ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. ఉన్నత పాఠశాల మైదానంలో వర్షపు నీరు నిలిచిపోవడంతో మండలస్థాయి క్రీడా పోటీలను నిలిపివేశారు.

యువత ఆత్మస్థైర్యాన్ని కోల్పోకూడదు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమాజంలో యువత ఆత్మస్థైర్యాన్ని కోల్పోకూడదని, ప్రతి సమస్యకు ఒక పరిష్కారం దొరుకుతుందని, దానిని గమనించుకుంటూ ముందుకుసాగాలని నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణకుమారి అన్నారు. గురువారం అంతర్జాతీయ ఆత్మహత్య నివారణ దినోత్సవం సందర్భంగా కళాశాల సమావేశ మందిరంలో విద్యార్థులతో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యువత ప్రతి చిన్న విషయాన్ని సీరియస్‌గా తీసుకొని ఆత్మహత్యలకు పాల్పడటం మంచి పద్ధతికాదన్నారు. ప్రతి ఒక్కరూ సమస్య పరిష్కారం కోసం ప్రయత్నిస్తే మంచి ఫలితాలు లభిస్తాయన్నారు. అధ్యాపకులు డాక్టర్ కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

గోకులకృష్ణలో ప్రాంగణ ఎంపికలు



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ బ్రహ్మయ్య, ప్రిన్సిపాల్ సురేష్, అధ్యాపక బృందం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని గోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం హెచ్‌సీఎల్ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. కంపెనీ ప్రతినిధులు బినీత్, ఆనంద్, హరికృష్ణలు విచ్చేసి విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. మొత్తం 150 మంది విద్యార్థులు ప్రాంగణ ఎంపికలకు హాజరుకాగా, వారిలో 27 మంది ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ముచ్చుకాల సురేష్ ఒక ప్రటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ బ్రహ్మయ్య, అధ్యాపక బృందం అభినందించారు.

పాదరక్షలు, దుప్పట్ల వితరణ



అర్చకులకు పాదరక్షలు అందజేసిన పసుపులేటి కిషోర్ తదితరులు

కోట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కోటలోని ప్రగతి ఆస్పత్రిలో గురువారం ఆ ఆస్పత్రి అధినేత పసుపులేటి కిషోర్ జన్మదినాన్ని పురస్కరించుకొని అర్చకులు, వారి కుటుంబసభ్యులకు పాదరక్షలు, దుప్పట్లు, కూరగాయలను వితరణగా ఇచ్చారు. జిల్లా అర్చక సలహామండలి సభ్యులు దివి అనంతాచార్యులు, అక్షయసేవాసమితి అధ్యక్షులు అల్లం రమణయ్య చేతుల మీదుగా ఆయా అర్చక కుటుంబాలకు ఈ సామగ్రిని అందజేశారు. అర్చక కుటుంబాలకు అండగా ఉండి అన్ని విధాలుగా ఆదుకుంటామని పసుపులేటి కిషోర్, డాక్టర్ దివ్యప్రియ దంపతులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నరేష్‌శర్మ, సాయిబాబా, పవన్, శివకుమార్, రూపేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

పోలేరమ్మ జాతర సందడి



వెంకటగిరిలో భవనాలపై భక్త జనం





అమ్మవారికి సారె తీసుకొస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు - ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కుటుంబసభ్యులు







సారె తీసుకొస్తున్న వెంకటగిరి రాజా కుటుంబీకులు సర్వజ్ఞకుమార్ యాచేంద్ర - నగరి నుంచి శరవళ్లు తీసుకొస్తున్న రాజా అనుచరుల



వీఐపీ క్యూలైన్ల వద్ద సామాన్య భక్తుల మధ్య తోపులాటలు, అడ్డుకుంటున్న పోలీసులు





పగిలే టెంకాయ ముక్కల కోసం - ఆటపాటల కోలాహలం

అమ్మవారి సేవలో ప్రముఖులు

వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర సందర్భంగా గురువారం అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆయన సతీమణి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, వెంకటగిరి రాజా కుటుంబీకులు సర్వజ్ఞ యాచేంద్ర, రాంప్రసాద్ యాచేంద్ర, వెంకటగిరి సివిల్ జడ్జి విష్ణువర్మ, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు కొండేపాటి గంగాప్రసాద్, తానంకి నానాజీ, డీసీఎంఎస్ చైర్మన్ గంగోడు నాగేశ్వరరావు కుటుంబ సమేతంగా, నెల్లూరు జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, నెల్లూరు జిల్లా ఎస్పీ శ్రీకాంత్ కుటుంబ సభ్యులు, న్యాయరోపతి డాక్టర్ బొలిగల మస్తాన్ యాదవ్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

జాతరలో సాంప్రదాయాలను మరిచారు

పోలేరమ్మ జాతర నిర్వహణలో పాటించాల్సిన సాంప్రదాయాలను అధికారులు, నిర్వాహకులు మరిచిపోయారని ఏపీపీ ప్రకృతికుమార్ అన్నారు. గురువారం స్థానిక పోలేరమ్మ ఆలయం వద్ద మాట్లాడుతూ జాతర నిర్వహణలో లోపాలు జరగనప్పటికీ ఆచార సాంప్రదాయాలు మరిచి అమ్మవారిని అగౌరవపరిచేలా నిర్వహించడం బాధాకరమన్నారు. జాతర నిర్వహణలో మేధావులతో సంప్రదింపులు జరిపి ఉంటే బేషుగ్గా జరిగేదన్నారు. ఈ కార్యక్రమంలో గోపీనాథ్, శ్యాంకుమార్, పోతులూరు, వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



జాతరలో వేషధారుల సందడి

స్థానిక కాశీపేట కూడలిలో పోలేరమ్మ జాతర సందర్భంగా వైసీపీ నాయకులు అర్జుగారి మురళి భక్తులకు, ప్రజలకు గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. ప్రతి ఏటా సుదూర ప్రాంతాల నుంచి జాతరకు వచ్చే భక్తులు దాహార్తి తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక పాత బస్టాండు సమీపంలో గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఒకటో పట్టణ ఎస్‌ఐ తిరుపతయ్య వివరాల మేరకు... స్థానిక పాతబస్టాండు సమీపంలో ఓ వృద్ధుడు అపస్మారకస్థితిలో పడివుండటాన్ని స్థానికులు గుర్తించారన్నారు. వృద్ధుడిని చికిత్సనిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారన్నారు. 60 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందడంతో మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలని నిరసన

గూడూరు అర్బన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీ నగర్ సమీపంలో బుధవారం హత్యకు గురైన రహీద్‌బాషా కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని అతడి కుటుంబసభ్యులు గురువారం స్థానిక డీఎస్పీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హత్య చేసిన వారిపట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించి, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రహీద్‌బాషాపై సోషల్ మీడియాలో అసత్య కథనాలు ప్రచురించారంటూ కుటుంబసభ్యులు రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రెస్టారెంట్‌పై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

కోట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కోట మండలం, విద్యానగర్‌లోని ఎక్స్‌ట్రాబేక్స్ రెస్టారెంట్‌పై గురువారం జిల్లా ఆహార భద్రత (ఫుడ్ సేఫ్టీ) అధికారి ఎస్.మద్దిలేటి ఆకస్మిక దాడులు నిర్వహించారు. రెస్టారెంట్‌లో బూజుపట్టిన, కాలంచెల్లిన తినుబండారాలను విక్రయిస్తున్నారంటూ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పనబాక కోటేశ్వరరావు, మండల అధ్యక్షుడు పులి సురేష్‌లు ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదుచేసి ఉన్నారు. దీంతో మద్దిలేటి తమ సిబ్బందితో వచ్చి ఆ రెస్టారెంట్‌లో తనిఖీలుచేయడంతో వాస్తవాలు వెల్లడయ్యాయి. ఫిర్యాదులన్నీ వాస్తవాలని తేల్చి, కొన్ని కాలంచెల్లిన తినుబండారాలను సీజ్ చేశారు. ఈ రెస్టారెంట్ యాజమాన్యంపై కేసులు పెట్టి అనుమతులు రద్దుచేస్తామని సేఫ్టీ అధికారి మద్దిలేటి తెలిపారు.

కొనసాగుతున్న ఆర్టీసీ ఉద్యోగుల నిరాహార దీక్షలు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట డిపో ఎదుట చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. డిపోలో పనిచేసే కండక్టర్ పద్మ సస్పెన్షను నిరసిస్తూ చేస్తున్న రిలే దీక్షలు గురువారంతో 14వ రోజుకు చేరాయి. ఈ దీక్షలో జమాల్, విజయకృష్ణ, పద్మ పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

గూడూరు అర్బన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోగినేనిపురంలోని విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈఈ నరేంద్రరెడ్డి గురువారం తెలిపారు. గూడూరు పట్టణ, మండలం, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు సంబంధించిన విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను పరిష్కరించుకునేలా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

నాయుడుపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు ఆ సంస్థ మేనేజర్ బాలాజీ అన్నారు. గురువారం పట్టణంలోని పలు వీధుల్లో ఆర్గనైజేషన్ సిబ్బందితో కలసి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎయిడ్స్ పట్ల జాగ్రత్తలు తీసుకోవాల్సిన పలు అంశాలపై అవగాహన కల్పించారు.

కమనీయం.. సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం

● సామూహిక వివాహాలతో ఒక్కటైన నూతన వధూవరులు ● కిటకిటలాడిన భక్త జనం





వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం, హాజరైన భక్తులు

చిట్టమూరు, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): మల్లాంలో జరుగుతున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో గురువారం ఉదయం వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. వేద పండితులు నాదెండ్ల రామేశ్వర గురుకుల్, ప్రధానార్చకులు భానుప్రకాష్ శర్మలు కల్యాణ కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ పాలక మండలి చైర్మన్ కామిరెడ్డి మునిశేఖర్‌రెడ్డి, సాహితిలతో కలసి ఉభయకర్తలు కల్యాణ వేదిక, పుష్పాలంకరణ, కానుకలను సమర్పించారు. వళ్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మండపంలో శత స్తంభాల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. కుమారుడి కల్యాణ్యానికి పట్టువస్త్రాలు, చందన, విభూది, గంధంతో కూడిన సుంగంధ ద్రవ్య పరిమళాలను శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి చైర్మన్, ఆలయ సభ్యులు, పండితులు వచ్చి చైర్మన్ దంపతులకు అందజేశారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు ముత్యాల తలంబ్రాలు వేసి ఆశీర్వాదం పొందారు. ఆంధ్ర, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు ఈ కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. చిట్టమూరు ఎస్‌ఐ చిన్న బలరామయ్య సిబ్బందితో కలిసి భక్తులకు భద్రత కల్పించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు స్వామి వారి ఉత్తరీయం, చిత్రపటాలను బహూకరించారు. అనంతరం ప్రసాద వినియోగం, బ్రాహ్మణ సమారాధన కార్యకలాపాలను ఉభయకర్తల ఆధ్వర్యంలో నిర్వహించారు.

సామూహిక వివాహాలు

వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవ సమయంలో వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ సుమారు 76 జంటలకు పైగా నూతన వధూవరులు వివాహాలు చేసుకున్నారు. అనంతరం స్వామి దర్శనం చేసుకొని నూతన దంపతులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. వేలాది మంది భక్తులకు అన్న ప్రసాదాలు అందించారు.

టీడీపీలో కష్టపడ్డవారికి సముచిత స్థానం

● ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రమాణస్వీకార పత్రాన్ని అందుకుంటున్న బాలచంద్ర కిషోర్, మురళిరెడ్డి, పక్కనే టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడ్డవారికి సముచిత స్థానం ఉంటుందని, పదవులు రాలేదని ఎవరూ అధైర్యపడవద్దని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. గురువారం స్థానిక రైతు సహకార సేవాసంఘ కార్యాలయంలో సూళ్లూరుపేట రైతుసేవా సహకార సంఘ అధ్యక్షుడిగా బాలచంద్ర కిషోర్, డైరెక్టర్‌గా నియమితులైన దువ్వూరు మురళిరెడ్డిల అభినందనసభ ఎమ్మెల్యే అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో పనిచేసే నాయకుల నుంచి కార్యకర్త వరకు అందరికీ గుర్తింపు ఉంటుందన్నారు. పదువులు ఉన్నా లేకున్నా పార్టీకోసం అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న బాలచంద్ర కిషోర్, మురళిరెడ్డిలతో ప్రమాణ స్వీకారం చేయించారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఇదే హవా కొనసాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బాలచంద్రకిషోర్, మురళిరెడ్డిలను ఘనంగా సన్మానించి, అభినందించారు. ముందుగా మన గ్రోమోర్ సెంటర్ నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా రైతు సేవా సహకార సంఘ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, రాష్ట్ర బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన్ శ్రీధర్, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, మాధవ నాయుడు, నాగేశ్వరస్వామి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, అలవల శ్రీనివాసులు, శ్రీనివాసుల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి

● 103 ఏళ్లు ఆరోగ్యంగా జీవించిన రామయ్య మొదలియార్

● 10 మంది మనవళ్లు, మనవరాళ్లు, 12 మంది మునిమనవళ్లు



చిన్నకుమారుడు యుగంధర్‌తో రెండ్రోజుల క్రితం ఫొటో దిగిన రామయ్య మొదలియార్, ఆయన సతీమణి ధనమ్మ

పెళ్లకూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీలపాటూరు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు ఆరూరు రామయ్య మొదలియార్ (103) గురువారం మృతి చెందారు. ఈయనకు అయిదుగురు మగ సంతానం కాగా, 10 మంది మనవళ్లు, మనవరాళ్లు, 12 మందిముని మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు. 1922లో జన్మించిన రామయ్య వ్యవసాయమే జీవనాధారంగా జీవించారు. పెద్ద కుమారుడు గోవర్ధన్ (58) హైదరాబాద్‌లోని యూనియన్ బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తూ రోడ్డు ప్రమాదంలో 2010లో మృతి చెందారు. రెండో కుమారుడు భాస్కర్ (55) నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. మూడో కుమారుడు సుధాకర్ శ్రీకాళహస్తిలో న్యాయవాదిగా ఉన్నారు. నాలుగు, అయిదో కుమారులు యుగంధర్, రమణయ్య ఇంటి వద్దనే ఉంటూ వ్యవసాయం చూసుకుంటారు. చిన్నకుమారుడు యుగంధర్ వద్దనే రామయ్య ఉన్నారు. 103 ఏళ్ల వయసులో కూడా ఆయన సొంతంగా తన పనులు చేసుకుంటూ కుమారులకు చేదోడు వాదోడుగా ఉండేవారు. రామయ్య మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సర్పంచ్ శివకుమార్,పరంధామయ్య, ప్రకాశం, రామయ్య తదితరులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.